ప్రభాత
# నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | TGTEL/25/A0100 | వాస్తవాలే వార్తలుగా..

7.6.2025
శనివారం Saturday
సంపుటి (volume): 1
సంచిక (Issue): 10
పేజీలు : 8
Pages : 8
వెల రూ. 2.00
Published from : Siddipet
Circulated to : Telangana









## బనకచర్లతో అన్యాయం

- ఆమోదయోగ్యం కాదంటూ కేంద్రానికి లేఖలు
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

02



## కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు

రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు

03

## గంధమల్ల రిజర్వాయర్‌ను
# పూర్తి చేయలేదేం?



### మూసీ ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటారు

- తిరుమలలాగా యాదగిరిగుట్ట అభివృద్ధి
- యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం
- అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

**యాదగిరిగుట్ట, జూన్ 6:** గంధమల్ల రిజర్వాయర్‌నును గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు పూర్తిచేయలేకపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. యాదగిరిగుట్ట పేరును గత ప్రభుత్వంలో యాదాద్రిగా మార్చారని, మేం వచ్చాక మళ్లీ ప్రజలంతా పిలుచుకునే యాదగిరిగుట్టగా మార్చామన్నారు. తిరుమల మాదిరిగా యాదగిరిగుట్ట ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్ వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. తుర్కపల్లి మండలంలో 66 వేల ఎకరాల ఆయకట్టు లక్ష్యంగా నిర్మించబోతున్న గంధమల్ల రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే ఇంటిగ్రేటెడ్ స్కూల్, యాదగిరిగుట్ట మెడికల్ కాలేజ్, వేద పాఠశాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కొలనుపాక-కాల్వపల్లి హైలెవెల్ వంతెన, మోటకొండూరులో ఎంపీపీ, మండలాఫీసు, పోలీస్ స్టేషన్ భవనాలకు కూడా శంకు స్థాపన చేశారు. అయితే.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ..

మిగతా 2 లో

## అదో దెయ్యాల రాజ్యసమితి

ఫాంహౌస్‌లో నిద్రపోతున్న దెయ్యాల నేత

02



## కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ

- చీనాబ్ రైల్వే వంతెనకు ప్రధాని మోడీ పచ్చజెండా
- రైలు బోగీలో ప్రయాణించిన మోడీ తదితరులు
- ఈఫిల్ టవర్‌కన్నా ఎత్తయిన వంతెనగా ప్రసిద్ధి
- శ్రీనగర్-వైష్ణోదేవి మధ్య నేటి నుంచి రాకపోకలు



పహల్గాం ఉగ్రదాడి తర్వాత తొలిసారి కశ్మీర్ లోయలో పర్యటించిన ప్రధాని.. ప్రపంచం లోనే ఎత్తైన బ్రిడ్జిగా నిలిచిన చినాబ్ వంతెనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పామని పునరుద్ఘాటించారు.

04




04

## నీట్ వాయిదా

ఆగస్టు 3న నిర్వహించనున్న ఎన్‌బీఈ వాయిదాను అంగీకరించిన సుప్రీం కోర్టు

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్- 2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది.

## కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా
# బయట పెట్టాలి

### తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదు
### కంఠంపై తుపాకి పెట్టినా నిజాలే చెబుతా

- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పుకోలే
- కేబినేట్ ఆమోదం తరవాత త్రీమెన్ కమిటీ వేశారు
- కాళేశ్వరం నిర్ణయం మొత్తం కెసిఆర్‌దే
- కమిషన్ విచారణలో ఈటెల వెల్లడి



కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు.

3లో



## బనకచర్లపై సుప్రీంను
# ఆశ్రయిస్తాం

నీళ్లను దోచుకుంటున్నా కండ్లు తెరువరా?

ప్రభుత్వంపై మండిపడ్డ హరీష్ రావు

65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ అంటూ హరీష్ రావు ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు.

03

## ఆర్బీఐ రెపోరేటు తగ్గింపు ప్రకటన

### స్టాక్ మార్కెట్లో భారీ ఊపు
### షేర్లకు గరిష్ట లాభాలు



ఆర్బీఐ రెపోరేటు తగ్గింపు ప్రకటనతో భారత స్టాక్ మార్కెట్లు బ్లాక్‌బస్టర్ ఫ్రైడేని చవిచూశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటు తగ్గింపుతో నిఫ్టీ 25,000 మార్క్ దాటింది. బ్యాంక్ నిఫ్టీ అయితే, ఏకంగా రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుంది.

03



## మావోయిస్ట్ మరో అగ్రనేత
# భాస్కర్ హతం

### ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు
### ఆడెల్లు అలియాస్ భాస్కర్‌ది ఆదిలాబాద్

02



# గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తి చేయలేదేం?

మొదటి పేజీ తరువాయి

యాదగిరిగుట్టలో యూనివర్సిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. మూసీనది ప్రక్షాళన చేస్తామని ఆనాడే చెప్పామని, సబర్మతి, గంగా, యమున ప్రక్షాళన చేస్తున్నప్పుడు మూసీ ఎందుకు ప్రక్షాళన చేయకూడదని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా.. ఎర్రవల్లి, మొయినాబాద్, జన్వాడ ఫాంహౌస్‌లు లాక్కుంటామని మేం అనడం లేదని, గోదావరి జలాలతో మూసీ ప్రక్షాళన చేస్తామనే అంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో మూసీ పక్కన ఉన్నవారి ఇళ్లను కూలుస్తున్నామని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మూసీ పక్కన ఉన్నవారంతా మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా నుంచి వచ్చినవారే అని ఆయన అన్నారు. వారికి వెయ్యి ఎకరాలు కేటాయిస్తామని చెప్పామని, 50 వేలు జేబులో లేని మందుల సామేల్‌ను 50వేల మెజార్టీతో నల్గొండ జిల్లా ప్రజలు గెలిపించారని సీఎం రేవంత్ అన్నారు. అలాగే యాదాద్రి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం తిరుమలాపూర్ ఏర్పాటు- చేసిన బహిరంగ సభలో పాల్గొన్న రేవంత్ కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో



జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మీద రేవంత్ విమర్శలు, సెటైర్లు సంధించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవిశ్వశాంతి మహాశక్తిగా గణపతి రూపం

## ఖైరతాబాద్ మహాగణపతి ఎత్తు 69 అడుగుల

## నిర్జల ఏకాదశి పురస్కరించుకున్న కర్రపూజ



**హైదరాబాద్, జూన్ 6:** హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు ఈ ఏడాది శంకుస్థాపనగా కర్ర పూజ ఘనంగా నిర్వహించారు. నిర్జల ఏకాదశి సందర్భంగా శుక్రవారం సంప్రదాయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ మహాగణపతి భక్తులకు 69 అడుగుల ఎత్తులో దర్శనమివ్వనున్నాడు. ఈసారి గణపతి రూపాన్ని శ్రీ విశ్వశాంతి మహాశక్తిగా రూపొందిస్తున్నారు. మహాగణపతికి కుడి వైపు శ్రీ జగన్నాథ స్వామి, శ్రీ లక్ష్మీ సమేత హయగ్రీవ స్వామి దర్శనమిస్తే, ఎడమవైపు లలిత త్రిపురసుందరి మరియు శ్రీ గజ్జలమ్మ దేవి కూడా కొలువై ఉంటారు. ఉత్సవ సమితి సభ్యులు ఈ ఏడాది గణపతి రూపాన్ని అధికారికంగా విడుదల చేశారు. భక్తులకు విశేషంగా ఆకర్షించే విధంగా రూపొందిస్తున్న ఈ గణేశ్ విగ్రహం నిర్మాణం త్వరలో ప్రారంభమవనుంది. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు ఉత్సవ కమిటీలు సిద్ధంగా ఉన్నాయి. కార్యక్రమానికి ఖైరతాబాద్ మహాగణపతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ కార్యక్రమాన్ని శ్రీగణేష్ ఉత్సవ కమిటీ- ఖైరతాబాద్, ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కర్ర పూజ కార్యక్రమంలో కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. రెండు ఉత్సవ కమిటీల అధ్యక్షుడిగా దానం నాగేందర్ నేతృత్వంలో కర్ర పూజ జయప్రదంగా ముగిసింది.

# బనకచర్లకు టెండర్ల ఆహ్వానం

## ఆర్థిక వనరుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు

## త్వరగా అటవీ, పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం

## ఉన్నతాధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశాలు

**అమరావతి,జూన్ 6:** త్వరలో పోలవరం - బనకచర్లకు టెండర్లు ఆహ్వానిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో ఆర్థిక వనరుల సమీకరణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే ఏపీ ప్రతిపాదనలు పంపించిందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అటవీ - పర్యావరణ అనుమతులు, డీపీఆర్ ఆమోదం తదితర అంశాలన్నీ అనుకున్న సమయానికి జరగాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణకు సైతం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. హైబ్రీడ్ యాన్యుటీ- విధానంలో పోలవరం - బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆయన వివరించారు. శుక్రవారం రాజధాని అమరావతిలోని సచివాలయంలో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుతోపాటు- ఆ శాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. టెండర్లకు సంబంధించిన రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీతో డ్రాఫ్ట్ డాక్యుమెంట్ రూపొందించడం, సాంకేతిక నిపుణుల పర్యవేక్షణ అనంతరం టెండర్లు పిలవడం వంటి అంశాలన్నీ జూన్ మాసాంతానికి పూర్తి కావాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. జల హారతి కార్పొరేషన్ కింద పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుండగా.. దీని కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీపీ) ఇప్పటికే ఏర్పాటు- చేశామన్నారు. మొత్తం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్ల వ్యయం అవుతుందన్నారు. అందులో 50 శాతం అంటే రూ.40,950 ఈఏపీ రుణంగా పొందాలని నిర్ణయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ గ్రాంట్‌గా 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు- సమకూర్చుకోవాలని.. రాష్ట్ర ప్రభుత్వ ఈక్విటీగా 10 శాతం నిధులు రూ.8,190 కోట్లు-.. హ్యామ్ విధానంలో మరో 20 శాతం నిధులు రూ.16,380 కోట్లు- ఖర్చు చేస్తుందన్నారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ ప్రాజెక్ట్ డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తి కావాలని ఆయన ఆదేశించారు. కృష్ణా - గోదావరి డెల్టాకు తక్షణమే నీరు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తుపాన్ల ముప్పు తప్పేలా పంట కాలం ముందుకు జరగాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 365 రోజులు భూమి పచ్చగా ఉండేలా.. అందుకోసం 3 పంటలు నిరంతరం పండించేలా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. బుడమేరులో పూడిక తొలగించాలని.. ఆ క్రమంలో వాగులో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా పూడిక తీత, ముళ్ల కంపలు తొలగించాలని సూచించారు. శాస్త్రీయంగా వాటర్ ఆడిటింగ్ - వాటర్ మేనేజ్‌మెంట్ జరగాలన్నారు. పిజియో మీటర్లు, సెన్సర్లు కొనుగోలుకు రూ.30 కోట్లు- కేటాయిస్తున్నట్లు- ప్రకటించారు. భూగర్భ జలాలు పెంచడం, రిజర్వాయర్లు నింపడం, జల వనరుల సమర్థ వినియోగం జరిగేలా చూడాలన్నారు. ప్రధానంగా ఈ 3 అంశాలపై దృష్టి సారించాలని ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. భూగర్భ జలాల వివరాలతో బులి-టె-న్లు విడుదల చేయాల్సి ఉందని అన్నారు. సీలేరు నీటిని కృష్ణా డెల్టాకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఇక హంద్రీ నీవా మెయిన్ కెనాల్ వైడనింగ్ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వెలిగొండ స్టేజ్ వన్ పనులు 2026 జూన్ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ఆర్థిక సాయం కోసం సాస్కిలో పెట్టండన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్ పూల్ మరమ్మతులకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఒక్క ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినా.. ఆ నీటితో మూడునాలుగేళ్లు కరువొచ్చినా వాటర్ మేనేజ్‌మెంట్ జరగాలని ఆయన ఆకాంక్షించారు. క్రాప్ ప్యాట్రన్ మార్చి.. తడి- ఆరుతడి పంటల సాగుకు యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని ఆదేశించారు. జల సంరక్షణ కోసం వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలని అధికారులకు సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు.

# అదో దెయ్యాల రాజ్యసమితి

- బీఆర్ఎస్ కాదు.. అది డీఆర్ఎస్..
- కవిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- ఫాంహౌస్‌లో నిద్రపోతున్న దెయ్యాల నేత
- సీఎం రేవంత్ విమర్శలు

**భువనగిరి, జూన్ 6 :** పదేళ్లలో ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేకపోయిన ఘనత బీఆర్ఎస్‌దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట వద్ద అపచారానికి మూల్యం చెల్లించుకున్నారు. పాపాలు చేసినందునే మీ పరిస్థితి ఆ విధంగా మారింది. తమ పార్టీలో దెయ్యాలు చేరాయని ఆ పార్టీ నాయకురాలే చెప్పారు. జవాబివ్వలేక దెయ్యాల నేత ఫాంహౌస్‌లో నిద్రపోతున్నారు. బీఆర్ఎస్ కాదు.. డీఆర్ఎస్.. దెయ్యాల రాజ్యసమితి. కొరివి దెయ్యాలను తరిమికొట్టే బాధ్యత నేను తీసుకుంటా. అందుకు కార్యకర్తల సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో



చేపట్టే పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. బంగారు తెలంగాణ ముసుగులో పదేళ్లు దోచుకున్న వాళ్లా నన్ను ప్రశ్నించేది. వాసాలమర్రి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఇళ్లన్నీ కూలగొట్టారు. ఆ తర్వాత కేసీఆర్ ఆ గ్రామాన్ని పట్టించుకోలేదు. పదేళ్లు దోచుకొని రాష్ట్రాన్ని రావణకాష్టంలా మార్చారు. రూ.8లక్షల కోట్లు- అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీశారు. విద్యార్థులు, రైతులు, ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్నారు. పేదలను తప్పుదోవ పట్టించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. రూ.20లక్షల కోట్లు ఉంటే రూ.2వేల కోట్లతో ఎస్ఎల్‌బీసీ పూర్తి చేయలేదు అంటూ నిప్పులు చెరిగారు. యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మార్చాం. కొండపై భక్తులు నిద్రించేలా.. ఆటోలు నడిచేలా చేస్తాం. 60 కిలోల బంగారంతో ఆలయ గోపురం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. టీటీడీ బోర్డు మాదిరిగా తెలంగాణలోనూ వైటీడీ ఏర్పాటు చేశాం. యాదగిరిగుట్టలోని విద్యాసంస్థలను వర్సిటీ స్థాయికి అభివృద్ధి చేస్తాం. ఎవరు అడ్డంపడినా సరే.. మూసీ ప్రక్షాళన చేసి నల్గొండ రైతులను ఆదుకుంటాం. గోదావరి జలాలతో మూసీ నదిని నింపుతాం. సబర్మతి, గంగా నదులు ప్రక్షాళన చేసుకోవచ్చు.. మూసీ నదిని మాత్రం ప్రక్షాళన చేయకూడదా అని ప్రశ్నించారు. సభలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, దామోదర రాజనర్సింహ, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



# బనకచర్లతో అన్యాయం

## ఆమోదయోగ్యం కాదంటూ కేంద్రానికి లేఖలు ● మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 6:** బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్రాష్ట్ర జలవిధానాలకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని మరోమారు స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై అభ్యంతరం తెలుపుతూ కేంద్రమంత్రులు సీఆర్‌పాటిల్, నిర్మలా సీతారామన్‌కు లేఖలు రాశామని చెప్పారు. ఏపీ నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని.. వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని పాటిల్ చెప్పారు. చట్టం ప్రకారం ముందుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏపీ ఉల్లంఘనలను పూర్తిగా లేఖల్లో వివరించాం. చట్టవిరుద్ధంగా ఏపీకి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంత వర-కై-నా పోరాడుతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తాం.. వెనక్కి తగ్గేదేలే. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు భారాస సహకరించింది. ఉమ్మడి ఏపీలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టీ-ఎంసీలు ఏపీకి వెళితే భారాస హయాంలో 1,254 టీ-ఎంసీలు తరలించారు. కాళేశ్వరానికి వృథా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవి. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద కట్టడం వల్ల రూ.68వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు ఖర్చు అయింది. ఏపీకి 512 టీ-ఎంసీలు, తెలంగాణకు 299 టీ-ఎంసీలు చాలని సంతకం చేసింది భారాస ప్రభుత్వం కాదా? కృష్ణా నీళ్లలో అప్పుడు మోసం చేసి ఇప్పుడు భారాస నేతలు నాటకాలు ఆడుతున్నారని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు.

# మావోయిస్ట్ మరో అగ్రనేత భాస్కర్ హతం

## ఛత్తీస్‌ఘడ్‌లో కొనసాగుతున్న ఎన్‌కౌంటర్లు

## మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్‌ది ఆదిలాబాద్

**రాయ్‌పూర్, జూన్ 6:** ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్లు ఆవోలను హతమారుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే జరిగిన వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. తాజాగా రెండోరోజూ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో శుక్రవారం భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మరో కీలక నేత మైలారపు ఆడెల్లు అలియాస్ భాస్కర్ మృతిచెందారు. ఆడెల్లు స్వస్థలం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామం. భాస్కర్ కేంద్ర కమిటీతోపాటు- రాష్ట్ర కమిటీకి కార్యదర్శిగా పని చేస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర కమిటీ స్థాయికి భాస్కర్ ఎదిగారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. అతడి తలపై రూ.25లక్షల రివార్డు ఉంది. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ఘటనా స్థలంలో ఏకే 47తోపాటు పలు ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సమాచారం. కాగా మావోలు, భద్రతా దళాల మధ్య ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి.



గురువారం నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ భద్రతా బలగాలకు సమాచారం అందింది. దీంతో ఈ ప్రాంతంలో భద్రతా బలగాలు, పోలీసులు కూంబింగ్ చేపట్టాయి. ఈ విషయాన్ని మావోయిస్టులు పసిగట్టారు. కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలపైకి కాల్పులు జరిపారు. దీంతో వారు ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మరణించారు. అతడి తలపై రూ. కోటి రివార్డు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు సైతం మృతిచెందిన విషయం విదితమే. ఇదే ప్రాంతంలో భారీగా ఆయుధాలను సైతం భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్‌లలో ఇప్పటికే వందలాది మంది మావోయిస్టులు మృతి చెందారు. అలాగే ప్రభుత్వం ఎదుట మరికొంతమంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇంకొంతమంది మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

# బనకచర్లపై సుప్రీంలో కేసు వేస్తాం

- అబద్ధాలతో కాలం గడుపుతున్న సీఎం, మంత్రులు
- ఏపి గోదావరి, కృష్ణాలు దోచుకుంటున్నా కళ్లు తెరవరా
- కేంద్రంతో పోరాటం చేయకుండా బిజెపి సైలెంట్ అయ్యింది
- ఉద్యోగులకు డిఏపై కేబినేట్‌లో ఇంతగా చర్చలా
- ప్రభుత్వంపై మండిపడ్డ హరీష్ రావు



**సిద్ధిపేట, జూన్ 6 :** అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అనుకున్నం, కానీ ఆయన్ని మించి తాత అయ్యిండు ఉత్తమ్ కుమార్ రెడ్డి అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఉత్తమ్ అబద్దాలు చూస్తే గోబెల్స్ అనేవాడు ఉంటే ఉరి పెట్టుకునేవాడు అని హరీశ్ రావు అన్నారు. దుబ్బాకలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు బీజేపీ ఎంపీలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ సమావేశం నిరాశపరిచిందని మాజీ మంత్రి హరీష్ రావువ్యాఖ్యలు చేశారు. ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. గాలి మోటార్‌పై తిరుగుతూ గాలి మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క డీఏ ఇచ్చేందుకు ముచ్చటగా మూడు కమిటీలు వేశారని.. దీనికి కేబినెట్‌లో అయిదు గంటల చర్చ చేశారని వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్ట నిలువునా ముంచుతోందన్నారు. తక్షణమే మూడు డీఏలు చెల్లించాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తోందన్నారు. ఉద్యోగస్తులపై సర్కార్ కేసులు పెడుతోందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అబద్ధాలలో రేవంత్ రెడ్డిని మించిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఉత్తమ్ కుమార్ ఏది మాట్లాడినా అబద్ధమే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించిందన్నారు. 65 టీఎంసీల నీటిని ఉపయోగించకుండా చేసింది ఉత్తమ్ అంటూ ఆరోపించారు. నీతి ఆయోగ్ మీటింగ్‌లో ప్రధానిని రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. గోదావరి బనకచర్ల కోసం బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టు వెళ్తుందన్నారు. గోదావరి బనకచర్ల మీద బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రీశైలం రైడింగ్ ప్రాజెక్టు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టును ఉత్తమ్ కుమార్ రెడ్డి అడ్డుకోవాలన్నారు. కాళేశ్వరం కుప్ప కూలిందని చెప్పే రేవంత్ రెడ్డి గంధమల్లకు నీళ్లు ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. కాళేశ్వరం కూలిందని కాంగ్రెస్ ప్రభుత్వం గ్లోబల్ ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్‌లో బనకచర్ల గురించి మాట్లాడేందుకు సమయం లేదా? ఇంతకంటే ముఖ్యమైన అంశం ఇంకోటి ఉంటదా? ఐదు గంటలు కమిషన్లు, పర్సెంటీజీలు, హైకమాండ్‌కు పంపే మూటల గురించి మాట్లాడారా? 400 టీఎంసీల గోదావరి జలాలను అక్రమంగా ఏపీ తరలిస్తుంటే గుడ్లు అప్పగించుకొని చూస్తారా? సుప్రీం కోర్టుకు వెళ్లరా, కేంద్ర మంత్రిని కలవరా, నీతి అయోగ్‌లో సీఎం ఎందుకు మాట్లాడలేదు. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. అపెక్స్ కమిటి అనుమతి లేకుండా, అంతర్ రాష్ట్ర అనుమతి లేకుండా, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే ఎందుకు మౌనం. చంద్రబాబును ఎదురించే దమ్ము సత్తా లేదా, ఎందుకు లాగులు తడుస్తున్నాయి. ఎందుకు సుప్రీం కోర్టుకు వెళ్లరు, ఎందుకు ప్రధానిని ప్రశ్నించరు. బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రం స్పందించకుంటే సుప్రీం కోర్టుకు బిఆర్‌ఎస్ వెళ్తుందని చెప్పినం. ఇప్పటికీ ఆ మాటకు కట్టు-బడి ఉన్నామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. లేఖలు రాసి చేతులు దులుపుకుంటన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకువెళ్లాలి, జంతర్ మంతర్ వద్ద ధర్నా చేద్దాం పదండి. కృష్ణా నదిలో న్యాయమైన వాటా కిందకి వదిలింది మీరు, గోదావరి బనకచర్ల కడుతుంటే చేతులు కట్టు-కొని చూస్తున్నది మీరు, శ్రీశైలం రైట్ కెనాల్ లైనింగ్ జరుగుతుంటే ఆపకుండా చూస్తున్నది మీరు, బిఆర్‌ఎస్ లైనింగ్ పనులు ఆపిస్తే ఇప్పుడు మీరు వచ్చాక మొదలు పెట్టారు. తక్షణం ఆ పనులను నిలిపి వేయించాలని డిమాండ్ చేసారు. రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బిజేపీ పెదవి విప్పడం లేదు. గోదావరి బనకచర్ల మీద బిజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజేపికి పట్టవా? బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి? శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కండ్లు తెరవండి. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ అక్రమ పనులు ఆపడం లేదు? గోదావరి బనకచర్ల అక్రమ ప్రాజెక్టును ఆపడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగం. కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్లు ఎలా వస్తాయి రేవంత్ రెడ్డి. గంధమల్లకు ఎట్ల కొబ్బరి కాయ కొడుతున్నవు. గంధమల్ల, మల్లన్నసాగర్, రంగనాయర్ సాగర్, మిడ్ మానేర్, ఎల్లంపల్లి.. ఇదంతా కాళేశ్వరం కాదా రేవంత్ రెడ్డి. కుప్పకూలింది అని ప్రచారం చేసావు. కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదావరి జిలాలు ఎట్ల వస్తాయి. నువ్వు ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ద తప్పు అని తేటతెల్లమైంది. నువ్వు చేసింది అదంతా గోబెల్స్ ప్రచారం అరని తేలిందన్నారు. మూసీలో గోదావరి నీళ్లు పోస్తా అంటవు, ఎట్ల సాద్యమైతది రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

# కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలి

- తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదు
- కంఠంపై తుపాకి పెట్టినా నిజాలే చెబుతా
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టుకు మహారాష్ట్ర ఒప్పుకోలే
- కేబినేట్ ఆమోదం తరవాత త్రీమెన్ కమిటీ వేశారు
- కాళేశ్వరం నిర్ణయం మొత్తం కెసిఆర్‌దే
- జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణలో ఈటెల వెల్లడి




**హైదరాబాద్, జూన్ 6:** కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. కాళేశ్వరం విచారణ అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. కంఠంపై తుపాకీ పెట్టినా ఈటెల నిజమే మాట్లాడుతారని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదా అని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ-గురించి ఇంజనీర్లు చూసుకోవాలని.. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బీజేపీ అని ఎంపీ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కేసీఆర్ అని ఆయనే చెప్పుకున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కేసీఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా విలువలతో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడిహట్టి రూ.16 వేలు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర కట్టాలని అనుకున్నా మహారాష్ట్ర ఒప్పుకోలేదన్నారు. మూడు బ్యారేజీలు సీడబ్ల్యూసీ రిపోర్ట్, టెక్నికల్ కమిటీ- ఆధ్వర్యంలో కట్టారన్నారు. మూడు బ్యారేజీలు సబ్ కమిటీ, టె-క్నికల్ కమిటీ రిపోర్టు ఆధారంగా కట్టారని వెల్లడించారు. మొదట రూ.63వేల కోట్ల అంచనాతో ప్రారంభం అయితే.. రైతుల డిమాండ్ మేరకు రూ.82 వేల కోట్లకు పోయిందన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏ పర్పస్ కోసం పెట్టారని కమిషన్ ప్రశ్నిస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఫైనాన్స్ శాఖకు సంబంధం లేదని చెప్పినట్లు తెలిపారు. 'మా బతుకులో నిబద్ధతతో ఉంది... నా గొంతుపై తుపాకీ పెట్టినా నిజాలే మాట్లాడతా. ఎవరు పిలిచినా ఎక్కడైనా నిజాలే చెప్తా. కొందరు బట్టకాల్చి మీదేస్తే నాకేమీ కాదు' అని అన్నారు. మూడు బ్యారేజీలు రూ.10వేల కోట్ల లోపే అని చెప్పారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను త్వరగా బయటపెట్టాలని.. నిజమైన దోషులు ఎవరో ప్రభుత్వం తేల్చాలని రాజేందర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ అవకతవకలపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ కొనసాగుతోంది. శుక్రవారం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓపెన్ కోర్టులో ఈటెలతో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణం చేయించింది. అనంతరం కమిషన్ ప్రశ్నలు సంధించింది. కమిషన్ ముందు 113వ సాక్షిగా మాజీ మంత్రి హాజరయ్యారు. దాదాపు 40 నిమిషాల పాటు- విచారణ సాగింది. బ్యారేజీల నిర్మాణం, కాలేశ్వరం కార్పొరేషన్, డీపీఆర్‌పై మొత్తం 19 ప్రశ్నలను కమిషన్ సంధించింది. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాతే మూడు బ్యారేజీల నిర్మాణం మొదలుపెట్టామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోలేదని తెలియజేశారు. మహారాష్ట్ర ఒప్పుకోకపోవడంతో 150 నుంచి 148 కుదించామన్నారు.

# వృద్ధ దంపతుల దారుణ హత్య

## రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్,జూన్ 6 :** హైదరాబాద్‌లో ఇద్దరు వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. ఫిజియోథెరపిస్ట్టులుగా వాచ్‌మెన్‌కు చెప్పి ఆ వృద్ధ దంపతుల ఇంట్లోకి వెళ్లిన దుర్మార్గులు అత్యంత కిరాతకంగా వారిని హత్యచేశారు. తీవ్ర సంచలం సృష్టించిన ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి షేక్ అబ్దుల్ (70), ఆయన సతీమణి విశ్రాంత లెక్చరర్ రిజ్వానా బేగం (67) 40 రోజుల క్రితం జన చైతన్య ఫేస్2లోని అపార్ట్‌మెంట్‌లోని 5వ అంతస్తులో ప్రత్యేకంగా నిర్మించుకున్న డూప్లెక్స్ ఇంట్లోకి వచ్చారు. అంతకు ముందు నగరంలోని రెడ్‌హిల్స్‌లో నివాసం ఉండేవారని తెలిసింది. ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు అబ్దుల్ నివాసానికి ఫిజియోథెరపి చేయడానికి వచ్చినట్లు- వాచ్‌మెన్‌కు చెప్పారు. దీంతో వాచ్‌మెన్ యజమాని అబ్దుల్‌కు ఫోన్ చేసి విషయం తెలిపాడు. అబ్దుల్ నివాసం ఉంటున్న ఐదవ అంతస్తుకు వెళ్లిన ఇద్దరిలో మాస్క్ ధరించిన వ్యక్తి కొద్ది నిముషాలలోపే కిందకు దిగి వెళ్లిపోయాడు. ఆ తరువాత 40 నిముషాల వ్యవధిలో ఆడ మనిషిగా బురకా ధరించిన వ్యక్తి గుట్టు చప్పుడు కాకుండా అక్కడి నుంచి వెళ్లినట్లు సీసీ టీ-వీలో రికార్డు అయినట్లు పోలీసులు గుర్తించారు. ఇదిలా ఉండగా రాత్రి 8 గంటల సమయంలో వాచ్‌మెన్ యజమానికి అబ్దుల్‌కు ఫోన్ చేయగా, లిఫ్ట్ చేయలేదు. దీంతో వారు నిద్రించి ఉంటారనుకున్న వాచ్‌మెన్ నిమ్మకుండిపోయాడు. ఉదయం 10 గంటల ప్రాంతంలో మంచినీళ్ల తెచ్చుకోవడానికి 5వ అంతస్తుకు వెళ్లిన వాచ్‌మెన్‌కు అబ్దుల్ ఇంటి డోర్లు తీసి ఉండడం గమనించాడు. యజయానికి పిలువగా ఎలాంటి సమాధానం రాకపోవడంతో దర్వాజ వద్దకు వెళ్లి చూడగా ఇంట్లో ఇద్దరు దంపతులు రక్తపు మడుగులో పడి ఉన్నారు. వెంటనే విషయాన్ని అపార్ట్‌మెంట్ వాసులకు తెలుపగా, వారు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. ఇద్దరు అప్పటికే ఇద్దరు దంపతులు రక్తపుమడుగులో మృతి చెందారు. మృతుడు అబ్దుల్ శరీరం పై ఏడు చోట్ల కత్తిపోట్లు ఉండగా, రిజ్వాన్ ఛాతిపై ఒక కత్తిపోటు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమ్మిత్తం మార్చురీకి తరలించిన పోలీసులు క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపారు.

# రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసు

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ, జూన్ 6:** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కేటీఆర్ గతంలో ఆరోపణలు చేశారు. దీంతో కేటీఆర్ చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ.. ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత ఫిర్యాదుతో కేటీఆర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని గతంలోనే కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు.. కేటీఆర్‌పై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుగుణ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై శుక్రవారం విచారణ జరుగగా.. పిటిషన్‌పై సమాధానం చెప్పాలంటూ కేటీఆర్‌కు సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

# ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపు ప్రకటన

## స్టాక్ మార్కెట్లో భారీ ఊపు

## గరిష్ట లాభాలను అందుకున్న షేర్లు

**న్యూఢిల్లీ,జూన్ 6:** ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపు ప్రకటనతో భారత స్టాక్ మార్కెట్లు బ్లాక్‌బస్టర్ ఫ్రైడేని చవిచూశాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటు తగ్గింపుతో నిఫ్టీ 25,000 మార్క్ దాటింది. బ్యాంక్ నిఫ్టీ అయితే, ఏకంగా రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఊహించిన దానికంటే ఎక్కువ రెపో రేటు తగ్గింపుతో పాటు నగదు నిల్వ నిష్పత్తి తగ్గింపుతో శుక్రవారం భారత బెంచ్‌మార్క్ సూచీలు మూడవ సెషన్‌లోనూ లాభాలు మూటగట్టుకున్నాయి. ఇక, నిఫ్టీ మూడు వారాల్లో ఉత్తమ ట్రేడ్ డే ను నమోదు చేసింది. శుక్రవారం వారాంతంలో మార్కెట్లు- ముగిసే సమయానికి సెన్సెక్స్ 746.95 పాయింట్లు- లేదా 0.92 శాతం పెరిగి 82,188.99 వద్ద ఉంది. నిఫ్టీ 252.15 పాయింట్లు- లేదా 1.02 శాతం పెరిగి 25,003.05 వద్ద ఉంది. ఇక, నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.2 శాతం పెరగగా, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం పెరిగాయి. ఇక, బిఎస్ఇ-లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ నిన్నటి రూ. 447.5 లక్షల కోట్ల నుండి రూ.451 లక్షల కోట్లకు పెరగడంతో పెట్టుబడిదారుల సంపద ఒక్కరోజులో రూ. 3.5 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఆర్‌బిఐ రెపో రేటును తగ్గించాలనే నిర్ణయం ద్రవ్యోల్బణం తగ్గిస్తుందని అంచనా వేయడం, హోం లోన్స్ ఇచ్చే బ్యాంకు షేర్లకు ఊతం వచ్చింది. దీంతో బ్యాంకింగ్ స్టాక్స్ తోపాటు రియాల్టీ ఇండెక్స్ 4 శాతం పెరిగింది. ఆర్బీఐ తాజా నిర్ణయం.. బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.2.5 లక్షల కోట్ల లిక్విడిటీ-ని ఇంజెక్ట్ చేయడానికి దోహదపడింది. ఆర్బీఐ.. ఈని దశలవారీగా 100 బేసిస్ పాయింట్లు- తగ్గించి 3శాతానికి తీసుకురావడంతో ఇది సాధ్యమైంది. తద్వారా బ్యాంకుల దగ్గర నగదు నిల్వలు పెరిగి మరిన్ని రుణాలిచ్చేందుకు వీలవుతుంది. ఫలితంగా మార్కెట్లోకి మనీ మరింతగా వస్తుంది. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ ఆర్బీఐ 9.5లక్షల కోట్ల డబ్బును వ్యవస్థలోకి తీసుకువచ్చింది. ఆర్బీఐ తాజా నిర్ణయాలతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ 1.5 శాతం పెరిగి కొత్త రికార్డు గరిష్ట స్థాయి 56,695కి చేరుకుంది. ఆటో, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ప్రైవేట్ బ్యాంక్ ఇండెక్స్‌లు ఒక్కొక్కటి 1 శాతానికి పైగా పెరిగాయి. మరోవైపు, మీడియా ఇండెక్స్ 1 శాతం తగ్గింది. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి ఉన్నాయి. అయితే హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, టాటా స్టీల్, భారతి ఎయిర్-టెల్, సన్ ఫార్మా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లో 110 కంటే ఎక్కువ స్టాక్‌లు వాటి 52 వారాల గరిష్ట స్థాయిలను తాకాయి. వీటిలో గోద్రేజ్ ఇండస్ట్రీస్, ముత్తూట్ ఫైనాన్స్, బజాజ్ హోల్డింగ్స్, మణప్పురం ఫైనాన్స్, మహారాష్ట్ర స్కూటర్స్, ፧ఈ÷ృ ఇండియా, ఆ÷ఖ స్మాల్ ఫైనాన్స్, ఐఉఎఈ ఆ፧ఈ, ఐఉఎఈ బ్యాంక్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, ÷ూఎ, ఆర అపోలో, వెల్‌స్పన్ కార్ప్, అబాట్ ఇండియా, అనుపమ్ రసాయన్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఆస్ట్రాజెనెకా ఫార్మా, సోలార్ ఇండస్ట్రీస్, లాయిడ్స్ మెటల్స్, మొదలైన స్టాక్స్ ఉన్నాయి.

# 12న పాఠశాలల ప్రారంభం

**హైదరాబాద్,జూన్ 6 :** కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ లోపే అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 1.40 కోట్ల పుస్తకాలు అవసరం కాగా, ఇప్పటివరకు 1.34 కోట్ల పుస్తకాలు పాఠశాలలకు చేరినట్లు- అధికారులు తెలిపారు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలోనే పాఠశాలలకు చేరేలా చర్యలు తీసుకున్నట్లు- పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాల సాధ్యమైనంత వేగంగా వాటిని పాఠశాలలకు తరలించాలని కార్యాచరణ రూపొందించారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు, మండల విద్యాధికారులు కొత్త పాఠ్యపుస్తకాలను తీసుకెళ్తున్నారు. పుస్తకాలు పాఠశాలలకు చేరిన తర్వాత స్కూల్లో తరగతుల వారీగా వేర్వేరు గదుల్లో ఉంచుతున్నారు. వర్షాల నేపథ్యంలో పుస్తకాలు తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటు-న్నారు.

# 5వేలు దాటిన కరోనా కేసులు

**న్యూఢిల్లీ,జూన్ 6 :** దేశంలో క్రమంగా మహమ్మారి కరోనా కేసులు పెరుగుతున్నాయి. తాజాగా ఇండియాలో కోవిడ్ కేసులు 5000 దాటాయి. 24 గంటల్లో కొత్తగా 500 కరోనా కేసులు, 4 మరణాలు సంభవించినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. దేశవ్యాప్తంగా కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య 5364కు చేరుకున్నాయి. అత్యధికంగా కేరళలో యాక్టివ్ కేసులు 1679కు చేరుకున్నాయి. తరువాత గుజరాత్ (615), పశ్చిమ బెంగాల్ (596), ఢిల్లీ(592) ఉన్నాయి. గత 24 గంటల్లో కేరళలో రెండు మరణాలు సంభవించగా, కర్ణాటక, పంజాబ్‌లో ఒక్కొక్కరు మరణించారు. గత 24 గంటల్లో 764 మంది కరోనా బాధితులు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. కోవిడ్ కేసుల పెరుగుదల నేపథ్యంలో, ఆక్సిజన్, ఐసోలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అవసరమైన మందుల లభ్యతను నిర్ధారించాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.




# పర్యావరణహితంగా అభివృద్ధి సాగాలి!

సంపాదకీయం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అట్టహాసంగా జరుపుకున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై నేతలంతా ఉపన్యాసాలు ఇచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని అంతా హితవు చెప్పారు. అసలు ప్లాస్టిక్ కవర్ల ఉత్పత్తిపై నిషేధం విధించే ఆలోచన మాత్రం పాలకులు ఎక్కడా ప్రస్తావించడం లేదు. పర్యావరణ విధ్వంసానికి కారణమైన ప్లాస్టిక్‌ను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే అందుకు ప్రత్యామ్నా యాలు ఆలోచించాలి. హోటళ్లు, ఇళ్లలో ఆకులతో తయారు చేసే కవరల్ను వాడాలి. అరిటాకులు, మోదుగు, బాదామ్ ఆకులను వినియోగించేలా చేయాలి. ప్రధానంగా పెళ్లిళ్లు, హోటళ్లలో ఈ తరహా ప్రయోగం రావాలి. ఇకపోతే పేరుకుపోతున్న ప్లాస్టిక్‌ను ఏరిపారేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. తిరుమలలో లడ్డూలను ప్లాస్టిక్ కవర్లలో ఇవ్వకుండా తాటాకు బుట్టలు, తుంగతో చేసిన లేదా జనుముతో చేసిన కవర్లన వాడాలి. ప్రయత్నం చేస్తే ఏదీ అసాధ్యం కాదు. మరోవైపు అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల నుంచి బయటపడాలి. నదులను శుభ్రం చేసి, అనుసంధానం దిశగా కార్యాచరణ సిద్దంచేయాలి. నదుల్లో ఎప్పుడూ నీరు అందుబాటులో ఉండేలా చూడాలి. యమునా కాలుష్యంపై ఢిల్లీ ఎన్నికల ముందు రోజూ వార్తలే. ఇప్పుడా విషయమే మరచి పోయారు. పాలకులు ఓటుబ్యాంక్ పథకాలు పక్కన పెట్టి ఇలాంటి వాటిని కూడా ఆలోచించాలి. భవిష్యత్ తరాల కోసం మనమంతా ఇప్పటినుంచే అడుగులు వేయాలి. వర్షాభావ పరిస్థితులు పదేళ్లకోసారి తప్పవని నిపుణులు అంటున్నారు. నైరుతి ప్రవేశించినా నేటికీ తగిన వర్షం జాడలేదు. అడపాదడపా అక్కడక్కడా పడుతున్న వర్షం లెక్కల్లోకి రాదు. వర్షాలు ముఖం చాటేస్తే జలాశయాలు వట్టిపోతాయి. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా పంఇంచిన పంటలకు ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు పడని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్టపోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయగలిగితే దేశం ఆర్థికంగా బలోపేతం కాగలదు. గతంలో లాగా వాగులు వంకలు పొంగే పరిస్థితి లేదు. వర్షాల తీరు ఇలాగే ఉంటే నీటి కష్టాలు తప్పేలా లేవు. ఇలాంటి సందర్భాల్లోనే ప్రత్యామ్నాయాలు ఆలోచన చేయాలి. పాలకులకు దూరదృష్టి అవసరం. నదీజలాలలను ఏటా వృథాగా సముద్రంలోకి వదలాల్సిన దుస్థితి నుంచి బయట పడాలి. వాటిని సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేయాలి. నదీ జలాలలను దేశం మొత్తానికి అందేలా...ప్రణాళికలు రూపొందించాలి. నదుల అనుసంధానంపై చర్చించాలి. దీనిపై సమగ్ర నివేదికలు రూపొందించాలి. నిపుణలను నియమించి గంగా,యమున,బ్రహ్మపుత్ర నదులను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. మోడీ తొలినాళ్లలో నదుల అనుసంధానం గురించి మాట్లాడారు. కానీ ఇప్పుడా మాట ఎత్తడం లేదు. ఇకపోతే వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్దతలను అవలంబించాలి. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్న సమయంలో వాటిని జలాశయాల్లోకి మళ్లించేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఉన్నకొద్దిపాటు ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. గతంలో వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్న తేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. ఈ దుస్థితి పోవాలంటే నీటి యాజమాన్యం అవసరం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. అలాగే వ్యవసాయంపై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు పెంచుకునేలా రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను కబ్జాకోరులు మింగిన పాపానికి ఏటా కురుస్తున్న వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగిపోతున్నాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. వర్షపునీటిని ఒడిసి పట్టుకుని ముందుకు సాగేలా ప్రణాళికలు చేసుకోవాలి. ఇది రాష్ట్రానికి, దేశానికి కూడా వర్తించేలా ఉండాలి. వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతి చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకుంటే ఓ పదేళ్లకు కాని ఆచారణలోకి రాదు. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగ మించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గిపోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపనిగా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. వంటనూనెల కోసం విదేశాలపై ఆధారపడకుండా దేశీయంగా నూనెగింజల ఉత్పత్తులను పెంచుకోవాల్సి ఉంది. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. రోజురోజుకూ నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగగలవు.

# కాశ్మీర్‌లో మరో అద్భుతం ఆవిష్కరణ

- చీనాబ్ రైల్వే వంతెనకు ప్రధాని మోడీ పచ్చజెండా
- రైలు బోగీలో ప్రయాణించిన మోడీ తదితరులు
- ఈఫిల్ టవర్‌కన్నా ఎత్తయిన వంతెనగా ప్రసిద్ధి
- శ్రీనగర్-వైష్ణోదేవి మధ్య నేటి నుంచి రాకపోకలు





**శ్రీనగర్, జూన్ 6 :** ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైల్వే వంతెనను ప్రధాని మోడీ అట్టహాసంగా ప్రారంభించారు. ఆపరేషన్ సిందూర్ తరవాత తొలిసారిగా ప్రధాని మోడీ కాశ్మీర్‌కు వెళ్లారు. శుక్రవరాం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జమ్ము కశ్మీర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. ఆయన వెంట కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. భారత దేశం మరో అద్భుత కట్టడానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగింది. చీనాబ్ రైల్వే బ్రిడ్జిగా పిలువబడుతున్న ఈ బ్రిడ్జి శుక్రవారం ఉదయం ప్రారంభం అయింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం ఉదమ్‌పూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు.. ఈ చినాబ్ రైల్వే వంతెన ఈఫిల్ టవర్ కంటే ఎత్తుగా ఉంటుంది. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన చినాబ్ సొంతం. అలాంటి రైల్వే వంతెనను ప్రధాని మోడీ శుక్రవారం జాతికి అంకింతం చేశారు. రూ.46వేల కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైలును కూడా జెండా ఊపి ప్రారంభించారు. వంతెన కారణంగా ఈ మార్గం ప్రధానంగా పర్యాటరంగాన్ని మరింత ఆకర్షించనుంది. శ్రీ మాతా వైష్ణో దేవి ఆలయాన్ని వందలాది మంది యాత్రికులు దర్శిస్తుంటారు. ఈ రైల్వే వంతెన ప్రారంభంతో పర్యాటకరంగంగా మరింత పుంజుకోనుంది. ఈ చినాబ్ బ్రిడ్జి 1,315 మీటర్లు విస్తరించి ఉంది. కఠినమైన వాతావరణాన్ని కూడా ఈ వంతెన తట్టు-కోగలదు. ఈ ప్రాంతం భూకంపం జోన్ 5లో ఉంది. ఇంజనీర్లు అత్యంత అద్భుతంగా ప్రణాళికలు వేసి ఈ బ్రిడ్జిని నిర్మించారు. గంటకు 260 కిలోమీటర్ల వేగంతో ప్రచండమైన గాలులు వీచినా ఈ వంతెనకు ఏం కాదు. బలమైన గాలులు తట్టుకునే విధంగా నిర్మించారు. ఇక వంతెన నిర్మించడానికి దాదాపు 30,000 టన్నుల ఉక్కును ఉపయోగించారు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే ఆర్చ్ వంతెనగా నిలుస్తుంది. చీనాబ్ వంతెన నిర్మాణం 2002లో వాజ్‌పేయ్ హయాంలో ప్రారంభించగా 2022లో మోడీ హయాంలో పూర్తయ్యింది. ఉధంపూర్–శ్రీనగర్–బారాముల్లా రైలు మార్గం ప్రాజెక్టులో భాగంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి విజయవంతంగా ముగించారు. శనివారం నుంచి శ్రీ మాతా వైష్ణో దేవి కత్రా రైల్వే స్టేషన్ నుంచి శ్రీనగర్ వరకు వందే భారత్ రైళ్లు పరిగెత్తనున్నాయి. ప్రధాని ప్రారంభించిన చీనాబ్ రైల్వే బ్రిడ్జి ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇది ఈఫిల్ టవర్ కంటే చాలా ఎత్తైనది. ఈఫిల్ టవర్ ఎత్తు 330 మీటర్లు మాత్రమే. కానీ, ఈ బ్రిడ్జి ఏకంగా 359 మీటర్ల ఎత్తులో ఉంది. ఈ బ్రిడ్జి పొడవు 1,315 మీటర్లు. కట్టింగ్ ఎడ్జ్ ఇంజనీరింగ్ టెక్నాలజీతో దీన్ని నిర్మించారు. ఈ బ్రిడ్జి గంటకు 266 కిలోమీటర్ల వేగంతో గాలి వీచినా కూడా ఏమాత్రం చెక్కు చెదరదు. ఈ బ్రిడ్జిలో ఆసక్తికరమైన మరో ప్రత్యేకత ఏంటంటే.. ఆ బ్రిడ్జి బ్లాస్ట్ రెసిస్టంట్ స్టీలు, కాంక్రీట్‌తో తయారు అయింది. బాంబు దాడులను సైతం బ్రిడ్జి తట్టుకుని నిలబడగలదు.

# నేను పారిపోయాను.. దొంగను కాను

## నెటిజన్ల కామెంట్లపై విజయ్ మాల్యా స్పందన



**లండన్, జూన్ 6:** బ్యాంకులకు రూ.వేల కోట్లు ఎగవేసి విదేశాల్లో దాక్కొన్న బిలియనీర్ విజయ్ మాల్యా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టయ్యే పరిస్థితులు ఉన్నాయి కాబట్టే తాను భారత్‌ను వీడానని పేర్కొన్నారు. దొంగతనం చేయలేదని.. అసలు దొంగతనం ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. తాను భారత్ నుంచి పారిపోయానని.. కానీ దొంగను కానని అన్నారు. భారత్ నుంచి వెళ్లిపోయినందుకు నన్ను దేశం నుంచి పారిపోయిన వ్యక్తి అని పిలవండి. కానీ దొంగ అని ముద్ర వేయకండి. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాల విషయంలో మోసం చేసినట్లు– విజయ్ మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచీ బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. తాను తీసుకున్న రుణాలకు అనేక రెట్లు బ్యాంకులు తన నుంచి వసూలు చేశాయని.. అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ ఆయన ఇటీవల కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఆర్‌సిబి విజయంతో మాల్యాచేసిన పోస్ట్‌పై వివాదంచెలరేగింది. ఆయన దొంగ అంటూ వ్యాఖ్యానించారు. దేశానికి వచ్చి ఎగవేతలను కట్టేయాలని సూచించారు. ఈ క్రమంలో మాల్యా స్పందించారు. ముందస్తు ప్రణాళికలో భాగంగానే 2016లో నేను భారత్ నుంచి విదేశాలకు వెళ్లాను. కొన్ని కారణాల వల్ల తిరిగి రాలేకపోయాను. ఈ దొంగతనం అనే విషయం ఎక్కడి నుంచి వచ్చింది. భారత్‌లో న్యాయమైన విచారణ, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని హామీ ఇస్తే దేశానికి తిరిగి వచ్చే విషయం గురించి ఆలోచించేవాడిని.. కానీ ఆ విధంగా ఉండదని నాకు తెలుసని మాల్యా అన్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ పునర్నిర్మాణ ప్రణాళికతో తాను అప్పటి ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీని సంప్రదించి.. తాను సమస్యల్లో ఉన్నట్లు ఆయనకు చెప్పానని మాల్యా అన్నారు. ఈ ఆర్థిక మాంద్యంలో పని చేయలేనని.. అందుకుగాను కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ విమానాల సంఖ్యను తగ్గించాలని, ఉద్యోగులను తొలగించాలని భావిస్తున్నట్లు– తెలిపానన్నారు. అయితే ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవద్దని, బ్యాంకుల నుంచి మద్దతు లభిస్తుందని ప్రణబ్ ముఖర్జీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం పలు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను దేశాన్ని వీడాల్సి వచ్చిందని తెలిపారు.

# నాలాల ఆక్రమణపై స్పెషల్ డ్రైవ్: హైడ్రా

**హైదరాబాద్, జూన్ 6 :** హైదరాబాద్ నగరంలోని నాలాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఆక్రమణలను కూల్చివేత లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. నాలాలను ఆక్రమించిన వారిని వదలబోమన్నారు. వచ్చే 4 నెలల పాటు ఈ అంశంపైనే దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. వరదనీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక అధ్యయనం చేయనున్నట్లు– తెలిపారు. నాలా, నీటి వనరుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నాలాలపై అక్రమంగా నిర్మించిన వాణిజ్య భవనాలను తొలగిస్తామని.. పేదల నిర్మాణాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రసూల్‌పురా నాలాపై అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని రంగనాథ్ తెలిపారు.




# నీట్ ఎంట్రన్స్ వాయిదా

## ఆగస్టు 3న నిర్వహించనున్న ఎన్‌బీఈ

## వాయిదాను అంగీకరించిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 6:** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్– 2025 పరీక్షను వాయిదా వేయాలన్న నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ అభ్యర్థనకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆమోదం తెలిపింది. జూన్ 15వ తేదీన జరగాల్సిన పరీక్షను ఆగస్టు 3వ తేదీన నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా న్యాయమూర్తి పీకే మిశ్రా నేతృత్వంలోని బెంచ్.. పరీక్ష వాయిదాపై కేంద్రాన్ని, ఎన్‌బీఈని ప్రశ్నించింది. 'ఇంకా రెండు నెలలు పరీక్షను వాయిదా వేయటం ఎందుకు..జులై రెండు లేదా మూడో వారంలో పరీక్ష నిర్వహించవచ్చుగా' అని అడిగింది. కేంద్రం తరఫున అదనపు సోలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ..' లాజిస్టికల్ సవాళ్ల కారణంగా పరీక్ష వాయిదా పడింది. పరీక్ష కేంద్రాల సంఖ్యను రెట్టింపు చేయడం, కఠినమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టడం వంటి వాటి కోసం ఈ నిర్ణయం తీసుకోవటం జరిగింది. చిన్న పొరపాట్లు– పరీక్ష ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే పరీక్షను వాయిదా వేయడానికి ఎన్బీఈ నిర్ణయించిందని తెలిపారు. అనంతరం న్యాయమూర్తి మిశ్రా మాట్లాడుతూ.. ' పరీక్ష ఎప్పుడు జరిగినా నిష్పక్షపాతంగా, సమగ్ర భద్రతతో జరగాలని స్పష్టం చేశారు. గత వారం ఇచ్చిన తీర్పును కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. అప్పటి నుంచి మీరు ఏం చేశారంటూ ఎన్‌బీఈని ప్రశ్నించింది. దీనిపై ఎన్‌బీఈ మాట్లాడుతూ.. ' పరీక్ష విషయంలో మేము ఏమాత్రం రాజీ పడదలచుకోవడం లేదని స్పష్టం చేసింది. కాగా, నీట్ పీజీ పరీక్షను రెండు షిఫ్టుల్లో జరపడానికి పర్మిషన్ కోరుతూ ఎన్‌బీఈ గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దానిపై విచారణ జరిపిన కోర్టు ఎన్‌బీఈ ప్రతిపాదనను తోసిపుచ్చింది. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగితే విద్యార్థులపై చెడుగా ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడింది. దేశ వ్యాప్తంగా ఒకే షిఫ్టులో పరీక్ష పెట్టాలని తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే పరీక్ష ఒకే షిఫ్టులో జరపడానికి మరింత సమయం కావాలని బోర్డు కోరింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన కోర్టు ఆగస్టు 3వ తేదీన పరీక్ష జరపడానికి అవకాశం కల్పించింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్షను ముగించాలని ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్ష నిర్వహణ తేదీని జూన్ 15 నుంచి మార్చుకునేందుకు వీలు కల్పించింది. వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నీట్)కు సంబంధించి ఇటీవల సుప్రీంలో విచారణ జరిగింది. పరీక్షను రెండు షిఫ్టలలో నిర్వహించడానికి నిరాకరించింది. దానివల్ల కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంది. పరీక్ష నిర్వహణలో పూర్తి పారదర్శకతను పాటించాలని, సురక్షితమైన పరీక్షా కేంద్రాలనే ఎంచుకోవాలని సూచించింది. రెండు ప్రశ్నపత్రాలు ఎప్పటికీ ఒకేవిధమైన కాఠిన్య లేదా సులభ స్థాయిని కలిగిఉండవని అభిప్రాయపడింది. పోటీ– తీవ్రత దృష్ట్యా ప్రతి మార్కూ ర్యాంకు నిర్ధరణలో అత్యంత కీలకమేనని తెలిపింది. నార్మలైజేషన్ విధానాన్ని కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే అనుసరించాలని, ప్రతి ఏడాదీ నిర్వహించుకొనే పరీక్షకు అది సరికాదని ధర్మాసనం పేర్కొంది.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
శనివారం 7 జూన్ 2025 హైదరాబాద్


# కాళేశ్వరంపై ఈటెల డొంకతిరుగుడు

**అవినీతి జరగలేదన్నట్లుగా వ్యాఖ్యలు**

**కెసిఆర్‌తో కుమ్మక్కయినట్లు స్పష్టం**

**మండిపడ్డ పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్,జూన్ 6 :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కేసీఆర్ తప్పేమీ లేదన్నట్లుగా, అంతా కేబినెట్ నిర్ణయం మేరకే జరిగిందని ఈటెల రాజేందర్ బుకాయిస్తున్నారని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆర్థిక మంత్రిగా ఉన్న వ్యక్తి ప్రాజెక్టు నిధులతో తనకు సంబంధమే లేదని అనడం హాస్యాస్పదమని వ్యాఖ్యలు చేశారు. దేశమంతా కాళేశ్వరం ప్రాజెక్టులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కోడై కూసిందన్నారు.కాళేశ్వరం కమిషన్ విచారణ అనంతరం బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపై మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి సంబంధించి విచారణ అనంతరం ఈటెల వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని... వేల కోట్ల అవినీతి జరిగిందంటూ గతంలో అనేక సార్లు ప్రధాని సహా పలువురు ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. కానీ ఈటెల అందుకు భిన్నంగా ఈరోజు కమిషన్ ఎదుట ఇచ్చిన వివరణను చూస్తే కేసీఆర్‌తో కుమ్మక్కయినట్లు- స్పష్టమైందన్నారు. కాళేశ్వరంలో ఈటెలకు కూడా వాటాలు ముట్టినందునే కేసీఆర్‌కు అనుకూలంగా మాట్లాడారని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం అవినీతిపై పల్లెత్తు మాట కూడా విచారణ కమిషన్ ఎదుట ఎందుకు చెప్పలేదని ఈ-టె-లను ప్రశ్నించారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలను పెంచినట్లు- ఈటెల చెప్పడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోందన్నారు. ఈ-టె-ల ఇంకా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నట్లు-ందని అన్నారు. కేసీఆర్‌ను కాపాడేందుకు పూర్తిగా వకాల్తా పుచ్చుకుని వివరణ ఇచ్చినట్లు- ఎంపీ మాటల ద్వారా కన్పిస్తోందన్నారు. పక్కా ప్రీ ఎ÷-లాన్ ప్రకారం కేసీఆర్, హరీష్ రావు, ఈ-టె-ల కూడబలుక్కుని ఒక్కటే సమాధానాలు చెప్పాలని, అవినీతి జరగలేదని బుకాయించేందుకు సిద్ధమై వచ్చి పచ్చి అబద్దాలు వల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ-టె-ల వ్యాఖ్యలు చూస్తుంటే హరీష్ రావుతో ఆయన రహస్యంగా భేటీ- అయ్యారని తాను చెప్పిన మాటలు నిజమని తేలిందన్నారు. టెక్నికల్ కమిటీ- ఇచ్చిన నివేదిక ఆధారంగానే ప్రాజెక్టు కట్టారని చెబుతున్నారన్నారు. కాళేశ్వరంలో వేల కోట్ల అవినీతి జరిగిందని మొత్తుకున్న బీజేపీ నాయకులు ఇప్పుడ ఏ ముఖం పెట్టు-కుని మాట్లాడతారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్‌తో బీజేపీకి ఉన్న లోపాయికారి ఒప్పందం మేరకే కేసీఆర్‌ను కాపాడేందుకు ఈటెలతో వివరణ ఇప్పించారా అని నిలదీశారు. దీనిపై బీజేపీ నాయకత్వం సమాధానం చెప్పాలన్నారు. లేదంటే ప్రధాని సహా బీజేపీ పెద్దలకు కూడా వాటాలు ముట్టినట్లే అని.. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని ప్రజలంతా భావించాల్సి వస్తుందన్నారు. 'కాళేశ్వరం విషయంలో బీజేపీ తన పంథా మార్చుకుందా? ఈ-టె-ల ఇచ్చిన వివరణ ఆయన సొంతమా? లేక బీజేపీ విధానమా? కాళేశ్వరంలో అవినీతి జరిగిందని బీజేపీ చెబుతుంటే... అసలు అవినీతే జరగలేదని మాట్లాడుతున్న ఈ-టె-లపై చర్యలు తీసుకునే దమ్ముందా? కాళేశ్వరంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించేందుకు సిద్ధమా?' అంటూ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

# కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌కు ఊరట

**ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు**

**బెంగళూరు,జూన్ 6:** బెంగళూరు తొక్కిసలాటకు సంబంధించి కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం, ఈవెంట్ ఆర్గనైజర్ డీఎన్‌ఏ ఎంటర్-టైన్‌మెంట్‌తో పాటు- కేఎస్‌సీఏపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తమపై దాఖలైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేఎస్‌సీఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించా.. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ ఇచ్చింది.ఐపీఎల్ 2025 ఛాంపియన్ గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు- విజయోత్సవ ర్యాలీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటతో తమకు ఎలాంటి సంబంధం లేదని కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది. ఇది కేవలం రాష్ట్ర ప్రభుత్వం, ఆర్సీబీ యాజమాన్యం, ఈవెంట్ నిర్వాహకుల తీరు వల్లే కొనసాగిందన్నారు. అభిమానులను కట్టడి చేయడంలో పోలీసులు విఫలం అయ్యారు.. వారు చేసిన పొరపాటుకు కేఎస్‌సీఏపై కేసులు పెట్టడం తగదని విమర్శించింది. దీనిపై కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఆర్సీబీ జట్టు విజయోత్సవ ర్యాలీతో తమకు ఎలాంటి సంబంధం లేదని కేఎస్‌సీఏ వెల్లడించింది. ప్లేయర్స్ ను సత్కరించాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది.. అది కూడా ఎం చిన్నస్వామి స్టేడియంలో జరగలేదు.. విధాన సౌధ దగ్గర కొనసాగదింది.. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ- సీఎంతో పాటు- కేబినెట్ మంత్రులు, ఉన్నతాధికారులు సైతం పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని అధికారులు పర్మిషన్ ఇచ్చారు.. ఇందులో కేఎస్‌సీఏ జోక్యం కొంచెం కూడా లేదన్నారు. కేవలం వేదికను రెండ్ కు ఇవ్వడం, క్రికెట్ సంబంధిత వ్యవహారాల వరకే అసోసియేషన్ బాధ్యత తీసుకుంటుందని కేఎస్‌సీఏ పేర్కొనింది.

# జీ7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం

**కెనడా ప్రధాని మార్క్ కార్నే మోడీకి ఫోన్**

**కలసి పనిచేద్దామని ఇరు దేశాల నేతలనిర్ణయం**

**న్యూఢిల్లీ, జూన్ 6:** జీ7 సదస్సుకు భారత్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ప్రధాని మోదీకి.. కెనడా ప్రధాని మార్క్ కార్నే ఫోన్ చేసి సదస్సులో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ విషయాన్ని మోదీ అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. కార్నేతో ఫోన్‌లో మాట్లాడటం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జీ7 సదస్సు జరుగనుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన్ను అభినందించినట్లు ప్రధాని మోడీ తెలిపారు. భారత్, కెనడా శక్తిమంతమైన ప్రజాస్వామ్య దేశాలన్న మోదీ.. పరస్పర ఆసక్తులను గౌరవించుకుంటూ పని చేస్తామన్నారు. మార్క్ కార్నేతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. 51వ జీ-7 సదస్సుకు కెనడా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణ అమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు. ఇటీవలి వరకు ఆహ్వానం అందలేదు. అయితే హాజరు కావడం లేదని పిఎంవో తెలిపింది. తాజా ఆహ్వానంతో ప్రధాని వెళతారా లేదా అన్నది తెలియాల్సిఉంది.

# కేబుల్ బ్రిడ్జిపై కారులో మంటలు

**హైదరాబాద్, జూన్ 6:** నగరంలోని మాదాపూర్ కేబుల్ బ్రిడ్జిపై శుక్రవారం సాయంత్రం ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఈ ఘటన కారణంగా కేబుల్ బ్రిడ్జి మీదుగా రోడ్డు నెంబర్ 45 వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కేబుల్ బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న ఒక కారులో శుక్రవారం సాయంత్రం సుమారు 4:30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ వెంటనే అప్రమత్తమై కారును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే కారు చాలా వరకు కాలిపోయింది. ఈ ఘటన కారణంగా కేబుల్ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాలను మళ్లించారు.

# బెంగళూరు తొక్కిసలాటలో మరో వికెట్ డౌన్

**సిఎం రాజకీయకార్యదర్శి గోవిందరాజన్‌కు ఉద్వాసన**

**బెంగళూరు,జూన్ 6 :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి కె.గోవిందరాజ్‌ను ఆ పదవి నుంచి తొలగించారు. ఆయన నియమాకాన్ని రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చినట్టు- ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఆర్‌సీబీ ఐపీఎల్ టీ-మ్ విజయోత్సవం సందర్భంగా బెంగళూరులోని స్టేడియంలో ఈనెల 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది దుర్మరణ పాలయ్యాయి. ఈ నేపథ్యంలో గోవిందరాజ్‌కు ఉద్వాసన చెప్పినట్టు- తెలుస్తోంది. అయితే ఆయనను తొలగించడానికి కారణం ఏమిటనేది అధికారిక ప్రకటనలో వెల్లడించలేదు. ఆర్‌సీబీ ఐపీఎల్ టీమ్ విజయోత్సవాన్ని విభేదిస్తూ తాను సీఎంకు సలహా ఇచ్చానని గోవిందరాజ్ పేర్కొన్నట్టు- ఒక కథనం వచ్చింది. అయితే తన మాటలను వక్రీకరించారని, ఈ అంశంపై తాను ఎప్పుడూ ముఖ్యమంత్రికి సలహా ఇవ్వలేదని గోవిందరాజ్ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రికి సలహా ఇవ్వడానికి నేనెవర్ని? అని ఆయన ప్రశ్నించారు. విషాదంతంగా మారిని ఫెలిసిటేషన్ ఈవెంట్ ఎ÷-లానింగ్, నిర్ణయం విషయంలో తనకెలాంటి ప్రమేయం లేదన్నారు. క్రికెట్‌కు సంబంధించిన విషయంలో తాను ఎలాంటి బ్రీఫింగ్ ఇవ్వలేదని, నిజానికి తాను కర్ణాటక ఒలంపిక్ అసోసియేషన్‌కు హెడ్‌గా ఉన్నానని చెప్పారు. ఆ కారణంగా క్రికెట్ సెలబ్రేషన్‌పై తాను సలహాలివ్వడం సరికాదన్నారు. కాగా, తొక్కిసలాట ఘటన అనంతరం బెంగళూరు సిటీ కమిషనర్ దయానంద సహా పలువురు అధికారులను సస్పెండ్ చేశారు.

# మేఘాలయలో వీడని దంపతులు మిస్టరీ

**నవ వధువు సోనమ్ కోసం ముమ్మర గాలింపు**

**కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, జూన్ 6:** మేఘాలయ మర్డర్ కేసు మిస్టరీ వీడడం లేదు. కొత్తగా పెళ్లయి ఈశాన్య రాష్ట్రమైన మేఘాలయకి హనీమూన్ వెళ్లిన ఇద్దరు కొత్త దంపతుల్ని హత్య, కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. భర్త రాజా రఘువంశీని కిరాతకులు కత్తితో పొడిచి చంపి లోయలో పడేశారు. అతని మృతదేహం డ్రోన్ల సాయంతో కనుగొన్నారు. అయితే, నవ వధువు సోనమ్ రఘువంశీ ఆచూకీ మాత్రం ఇప్పటికీ దొరకడం లేదు. మే 24న ఈ దారుణం చోటుచేసుకోగా ఇంకా సోనమ్ ఆచూకీ దొరక్కపోవడంతో ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి అప్పగించాలని బాధిత కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. నవ దంపతులు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌కు చెందినవారు. రాజా రఘువంశీ, అతని భార్య సోనమ్ అదృశ్యం కావడానికి ఒక రోజు ముందు షిల్లాంగ్ లోని ఒక హోటల్‌లో దంపతులిద్దరూ నడుస్తూ వెళు న్న దృశ్యాలు కొత్తగా బయటపడ్డ సిసి ఫుటేజ్‌లో కనుగొన్నారు. ఈ ఫుటేజ్ ఆధారంగా ఈ కేసులో కుట్ర కోణం కూడా ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మర్డర్ మిస్టరీని దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు- చేసింది మేఘాలయ సర్కార్. మేఘాలయ పోలీసులు దీన్ని హత్య, కిడ్నాప్ కేసుగా నమోదు చేశారు. ఈ జంట అదృశ్యం కావడానికి ముందు హైకింగ్‌కు వెళ్లే సమయంలో సోనమ్ తన ఫ్యామిలీతో మాట్లాడింది. ఇదే ఆమె చేసిన చివరి ఫోన్ కాల్. టూర్ కోసం దంపతులిద్దరూ స్థానికంగా ఒక స్కూటర్‌ను అద్దెకు తీసుకున్నారు. మే 24న తూర్పు ఖాసీ హిల్స్‌లోని సోహ్రారిమ్‌లో ఆ స్కూటర్ పార్క్ చేసి ఉంది. స్కూటర్ దొరికిన ప్రదేశానికి కొంత దూరంలో మే 30వ తేదీన సోమవారం నాడు లోయలో రాజా రఘువంశీ మృతదేహం కనుగొన్నారు. అక్కడే రాజా ఫోన్, అతన్ని చంపడానికి ఉపయోగించినట్లు- భావిస్తున్న కత్తినీ కనుగొన్నారు. ఇది హత్య కేసని స్పష్టంగా తెలుస్తుందని.. రాజా హత్యకు గురయ్యారని అందులో ఎటువంటి సందేహం లేదని తూర్పు ఖాసీ హిల్స్ ఎస్పీ అన్నారు. మేఘాలయ పోలీసులు హత్య కేసు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అయితే, సోనమ్ రఘువంశీ ఆచూకీ ఇప్పటికీ దొరకలేదు. ఆమె కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దర్యాప్తు సంస్థలూ సెర్చ్ ఆపరేషన్ చేస్తున్నాయి.

# ఇథనాల్ కంపెనీ అనుమతులు బిఆర్‌ఎస్ పుణ్యమే: సంపత్



**హైదరాబాద్,జూన్ 6 :** బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీష్‌రావు శవరాజకీయాలు చేస్తున్నారని ఎఐసిసి సంపత్ కుమార్ తెలిపారు. బిఆర్‌ఎస్ రాజకీయ కుట్రలో భాగంగానే ధన్వాడ ఘటన జరిగిందని, రైతులపై బిఆర్‌ఎస్ కార్యకర్తలు దాడులు చేశారని మండిపడ్డారు. ఇథనాల్ కంపెనీకి అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు.కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుమతులు ఇచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి అనుమతి ఇవ్వలేదని సంపత్ కుమార్ తెలియజేశారు. రైతుల భూములను ప్రభుత్వం లాక్కోలేదని స్పష్టం చేశారు. ప్రజల జీవితాలతో హరీష్‌రావు రాజకీయం చేయొద్దని సూచించారు. జోగులాం బ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండల పరిధిలో పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మించతలపెట్టిన ఇథనాల్ ఫ్యా క్టరీ నిర్మాణంపై 12 గ్రామాల ప్రజలు దాడి చేసిన విషయం తెలిసిందే.

# దండుపాళ్యం బ్యాచ్‌లా దోచుకున్న బిఆర్‌ఎస్

**వేములవాడ కోడెల మృతిపై ఇంత రాజకీయమా**

**మండిపడ్డ మంత్రి కొండా సురేఖ**



**హైదరాబాద్,జూన్ 6:** వేములవాడ కోడెల మృతిలో బిఆర్‌ఎస్ రాజకీయం చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బిఆర్‌ఎస్ నాయకులపై నిప్పులు చెరిగారు. దండుపాళ్యం బ్యాచ్‌లా ఇష్టారీతిలో పదేళ్ల రాష్ట్రాన్నికెసిఆర్ కుటుంబం దోచుకుందని, కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి చెందుతుంటే విష పురుగులై అడ్డుపడుతున్నారని మంత్రి కొండా అన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి కొండా సురేఖ ఓ ప్రకటన విడుదల చేశారు. రాజన్న కోడెలపై రాజకీయం చేయవద్దని, గడిచిన పదేళ్లలో వేములవాడ ఆలయానికి సంబంధించి ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. ఘటనపై స్పందించి బాధ్యతాయుతంగా చర్యలు తీసుకున్నామని అయినా బురద రాజకీయాలు చేస్తూ బిఆర్‌ఎస్ నాయకులు దిగజారుతున్నారని ఆమె మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు పదేళ్ల దుర్మార్గ పాలనపై ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆమె హితవుపలికారు. వేములవాడ రాజన్న ఆలయానికి కెసిఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదని మంత్రి గుర్తు చేశారు. నేటి కోడెల దుస్థితికి కెసిఆర్ పాలనే కారణమని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విజయవం తంగా పుష్కరాలు నిర్వహించిందని, 30 లక్షల మంది భక్తులు పుష్కరాలకు వచ్చినా ఎటు-వంటి ఇబ్బందులు కలగలేదని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. వరంగల్ భద్రకాళి ఆలయ విస్తరణ నిర్మాణ పనులను కోట్ల రూపాయలతో చేపట్టామని ఆమె పేర్కొన్నారు. యాదగిరిగుట్ట మీద కెసిఆర్ బొమ్మలను చెక్కించుకున్న బిఆర్‌ఎస్ నాయకులు దేవుళ్ల విషయంలో మాట్లాడే అర్హత లేదని మంత్రి కొండా మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాదగిరిగుట్టకు రూ. 63 కేజీల బంగారు గోపురం తాపడం చేయించినట్లు- మంత్రి గుర్తు చేశారు. సామూహిక కోటి దీపోత్సవం, నదీహారతి, కాళేశ్వరం, యాదగిరి గుట్టలకు మహా కుంబాభిషేకం చేశామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో దేవాదాయ శాఖలో అభివృద్ధి జరిగిందా, బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇన్ని కార్యక్రమాలు చేసిందా అని మంత్రి నిలదీశారు. సిఎం రేవంత్‌రెడ్డి మాస్టర్ ప్లాన్‌తో రాజన్న ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు- ఆమె తెలిపారు. ఒక్కో నెలలో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో కోడెలను ఇచ్చి వెళతారని, కొన్ని సార్లు అనారోగ్యంగా ఉన్న కోడెలను వదిలి వెళ్లిన దాఖలాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి నేపథ్యంలో జరిగిన సంఘటనలను రాద్ధాంతాం చేసే వారు సిగ్గుపడాలన్నారు. కోడెలు జబ్బుపడ్డప్పుడు సంరక్షించేందుకు 12 మంది పశువైద్య అధికారులను నియంమిచినట్లు- ఆమె గుర్తు చేశారు. గోవులను కాపాడాలని, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందని ఆమె స్పష్టం చేశారు. వేములవాడలో విశాలమైన గోశాల ఏర్పాటు-కు స్థలం పరిశీలించాలని సిఎం సూచించారన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ సమీపంలో ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు చేయాలని అధికారులను ముఖ్యమంతి ఆదేశించినట్లు మంత్రి కొండా తెలిపారు.

# ఢిల్లీ సిఎం రేఖా గుప్తాకు బెదిరింపులు

**న్యూఢిల్లీ,జూన్ 6 :** దేశరాజధాని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను చంపేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. ఘజియాబాద్‌లోని పోలీస్ కంట్రోల్ రూమ్ కు అర్ధరాత్రి దుండగుడు ఫోన్ చేసి.. సిఎంను హత్య చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఢిల్లీ సిఎంకు భద్రత కట్టుదిట్టం చేశారు. ఘజియాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 11:00 గంటల ప్రాంతంలో బెదిరింపు కాల్ వచ్చింది. బెదిరింపు కాల్ చేసిన వ్యక్తి.. తర్వాత ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేశాడు. బెదిరింపులకు పాల్పడిన దుండగుడి పట్టుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అనుమానితుడిని గుర్తించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# ఆటోను ఢీకొన్న లారీ: ఇద్దరు మృతి

**సంగారెడ్డి,జూన్ 6 :** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ అదుపుతప్పి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం సదాశివపేటలో ఈ ప్రమాదం చోటు-చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్ మార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారిని సాయికిరణ్, అభిషేక్‌గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




# దళసభ్యుడి టు దండకారణ్యం

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడెల్లు ప్రస్థానం ఇదీ

## అడెల్లు ఎన్ కౌంటర్ కాదా?

### సుధాకర్ తో సహా పట్టుబడ్డ 10 మందిలో ఒకరా?

### తర్వాత జరిగే ఎన్‌కౌంటర్‌లలో మిగిలిన వారి సంగతి?

### కలకలం రేపుతోన్న 'ఆపరేషన్ కగార్'!

రాధారపు నర్సయ్య
(నేటి సాక్షి, తెలంగాణ బ్యూరో)

ఛత్తీస్‌గఢ్ఎన్ కౌంటర్ లో గురువారం తెల్లవారుజామున అసువులు బాసిన 'అడెల్లు అలియాస్ భాస్కర్' పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన పేరది.! య-ువతను మావోయిస్టు పార్టీ వైపు ఆకర్షించడం, పార్టీకి పెద్ద ఎత్తున నిధులు సమకూర్చడంలో అందె వేసిన చేయది.! ఎన్నో సార్లు ఎన్కౌంటర్ తప్పించుకున్నవాడు. తృటిలో తప్పించుకునే చురుకుదనం చూసిన మావోయిస్టు పార్టీ ఆయనను తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియమించింది. చాలా త్వరితగతిన రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన నేతల్లో ఆయనను ఒకరిగా చెబుతారు. గురువారం నేషనల్ పార్క్ ఏరియాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, కొమురంభీమ్, మంచిర్యాల ఏరియా జిల్లా కమిటీ కార్యదర్శి అడెల్లు మరణించడం ఆ పార్టీకి పెద్ద దెబ్బనేనని చెబుతున్నారు.

#### అడెల్లు ఉద్యమ నేపథ్యం ఇదీ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో జన్మించిన భాస్కర్ 10వ తరగతి వరకు బోథ్ లో చదివారు. 1989-91లో నిర్మల్ లో ఇంటర్ చేశారు. ఆ సమయంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్యూ) అధ్యక్షుడిగా పని చేశారు. అభ్యుదయ భావాలు కలిగిన భాస్కర్ ఆ సమయంలోనే 'పీపుల్స్ వార్'వైపు ఆకర్షితులయ్యారు. విద్యార్థి దశలోనే 1989 కాలంలో భూపోరాటాలు విస్తృతంగా సాగుతున్న సమయంలో తాను కూడా అందులో పాల్గొన్నాడు. 1994-95 లో దళంలోకి ప్రవేశించాడు. బోథ్ దళ సభ్యుడిగా పని చేసి ఇంద్రవెల్లి దళం డిప్యూటీ కమాండర్ గా ఎదిగాడు. కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు చత్తీసఘడ్ దండకారణ్యంలోకి వెళ్లాడు. 25 ఏళ్ల వయసులో భాస్కర్ దళంలో చేరినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలుస్తోంది. తల్లిదండ్రులు చనిపోయారు. భాస్కర్ కు ముగ్గురు సోదరులు. ఆయన దళంలో పని చేస్తున్న సమయంలోనే సహచరురాలు కంతి లింగవ్వను వివాహం చేసుకున్నట్లు చెప్తారు. ఆమె ఎన్కౌంటర్లో మరణించారు.

#### రిక్రూట్‌మెంట్‌పైనే ప్రధాన దృష్టి..

దళంలో చేరి అంచెలంచెలుగా ఎదిగిన భాస్కర్ మావోయిస్టు పార్టీలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, కొమురం భీమ్, మంచిర్యాల ఏరియా జిల్లా కమిటీ కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చాలా తొందరగా రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారని పోలీసు వర్గాలు చెబుతాయి. 1995లో మావోయిస్టు పార్టీలో చేరిన ఆయన మూడు దశాబ్దాలుగా అజ్ఞాతంలోనే ఉండిపోయారు. ఛత్తీస్గఢ్ ప్రాంతంలో పనిచేసినప్పుడు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రిక్రూట్మెంట్ పై దృష్టి సారించి ఇక్కడ చాలా మందిని పార్టీ వైపు ఆకర్షించేలా చేయడంలో విజయం సాధించారు. ఆయన ఎన్నో ఎన్ కౌంటర్ల నుంచి తృటిలో తప్పించుకున్నారని చెబుతారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన దాదాపు ఎనిమిది ఎన్కౌంటర్ల నుంచి ఆయన తప్పించుకున్నారంటారు. కడంబా అడవుల్లో సైతం జరిగిన ఎన్కౌంటర్లో పోలీసులు చుట్టుముట్టినా తప్పించుకోగలిగారు.

#### అడెల్లు మృతి.. పార్టీకి కోలుకోలేని దెబ్బ

మావోయిస్టు పార్టీకి తీరని నష్టం భాస్కర్ అలియాస్ అడెల్లు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడం.. ఆ పార్టీకి తీరని లోటని చెబుతున్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూలమూలనా పరిచయాలు ఉన్న ఆయన చనిపోవడం పార్టీకి కోలుకోలేని దెబ్బ అని చెబుతున్నారు. ఆయన ఆధ్వర్యంలో పదుల సంఖ్యలో యువత మావోయిస్టు పార్టీలో చేరారు. ఆయన కోసం ఏకంగా నాలుగు జిల్లాల ఎస్పీలు రంగంలోకి దిగి మరీ మట్టుబెట్టేందుకు ప్రయత్నాలు చేసేవారు. ఆయన ఏనాడూ పోలీసులకు చిక్కలేదంటారు.

#### ఛత్తీస్‌గఢ్ పోలీసులను ముప్పుతిప్పలు

అడెల్లు ఆదిలాబాద్ జిల్లా పోలీసులనే గాక ఛత్తీస్‌గఢ్ పోలీసులను కూడా ముప్పు తిప్పలు పెట్టారని సమాచారం. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా ఆయన పేరు వినిపించేది. కానీ, చివరి క్షణాల్లో అడెల్లు తప్పించుకునేవాడు. చివరా ఖరికి ఆయన ఛత్తీస్‌గఢ్ ఎన్ కౌంటర్‌లో నేలకొరగడంతో ఈ ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బనే అంటున్నారు. వరుసగా..జరుగుతోన్న ఎన్ కౌంటర్లలో మావోయిస్టు అగ్రనేతలు హతమవుతుండడంతో పార్టీ కలవరపడుతోంది.!!



# కనుమరుగవుతోన్న 'క్రాంతి' కపోతాలు!



## వైఎస్ హయాంలోనే నమ్మించి నరమేధం..


- 2004 నాటి 'శాంతి చర్చల ప్రతినిధులూ' టార్గెట్?
- 'ఆపరేషన్ కగార్' ద్వారా 'అగ్రనేతల' అంతమే వ్యూహమా?
- చర్చల సమయంలో ఉన్న 42 మంది కేంద్ర కమిటీ సభ్యుల్లో మిగిలివున్న వారెందరు?
- జనశక్తి నుంచి వచ్చిన ఇద్దరు ప్రతినిధుల్లో ఒకరైన 'రియాజ్' తొలి ఎన్‌కౌంటర్
- మావోయిస్టు నుంచి వచ్చిన ముగ్గురు ప్రతినిధుల్లో ఒక్కరే మిగిలారు?
- 'ఆర్కే'.. గుండెపోటుతో మృతిచెందగా.. 'సుధాకర్' ఎన్‌కౌంటర్ లో హతం

రాధారపు నర్సయ్య
(నేటి సాక్షి, తెలంగాణ బ్యూరో)

దాదాపు 21 ఏళ్ల క్రితం.. ప్రభుత్వంతో 'శాంతి చర్చల' కోసం మావోలను అడవి నుండి హైదరాబాద్ కు గద్దర్ తీసుకొచ్చారు.వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరిపింది.మావోయిస్టులను అడవులో నుండి తీసుకువచ్చి జాగ్రత్తగా అడవులో దింపడంలో గద్దర్ కీలకంగా వ్యవహరించారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. మావోయిస్టుల(నక్సలైట్లు)తో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం చర్చలు జరుపుతామని ప్రకటించింది. ఆనాడు హెూంమంత్రిగా ఉన్న జానారెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున చర్చలకు మావోయిస్టులను చర్చలకు ఆహ్వానం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులను చర్చలకు ఆహ్వానం పలికింది. ప్రభుత్వంతో చర్చలకు మావోయిస్టులు అడవుల నుండి హైదరాబాద్ కు వచ్చారు. మావోయిస్టు పార్టీ అప్పటి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏఓబీ సెక్రటరీ సుధాకర్, గాజర్ల రవి అలియాస్ గణేష్ లు హైద్రాబాద్ కు వచ్చారు.






#### గద్దర్ నేతృత్వంలో..

2004 అక్టోబర్ 11న ప్రకాశం జిల్లా చిన్నఆరుట్ల గ్రామం వద్ద నల్లమల అటవీ ప్రాంతం నుండి మావోయిస్టులు, జనశక్తి నేతలు బయటకు వచ్చారు. గద్దర్ నేతృత్వంలోని బృందం వారిని సురక్షితంగా హైదరాబాద్ కు తీసుకు వచ్చింది. 2004 అక్టోబర్ 15, 16, 17 తేదీల్లో మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. ఈ చర్చల సమయంలోనే మావోయిస్టు అగ్రనేత హైదరాబాద్‌లో కంటి పరీక్షలు చేయించుకున్నారు. హైద్రాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. చర్చలు సానుకూల దృక్పథంలో జరిగాయి. కొన్ని విషయాల్లో మాత్రం ఇరు వర్గాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. అయితే చర్చలు కొనసాగించాలని భావించాయి. కాల్పుల విరమణ ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంతో చర్చలు ముగిసిన తర్వాత మావోయిస్టులను గద్దర్ అడవుల్లోకి తీసుకెళ్లి వదిలిపెట్టాడు.

#### రియాజ్ ఎన్ కౌంటర్ తో మొదలు..

అయితే..ప్రభుత్వం తరపున చర్చలకు వచ్చిన జనశక్తి నేత 'రియాజ్' ఎన్ కౌంటర్ లో మృతి చెందారు.నమ్మించి.. ఆనవాళ్లు కనుక్కుని.. అగ్రనేతల అంతానికి ఆనాడే వ్యూహాత్మక పథకరచన చేశారు.ఆ తర్వాత ఎన్నో చోట్ల ఎన్ కౌంటర్లు జరిగాయి. దీంతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు పూనుకుంటూనే ఉన్నాయి.

#### 'ఆపరేషన్ కగార్' తో.. మూల స్తంభాలు ఖతం..

2026 మార్చి -31 లోగా మావోయిజాన్ని అంతమొందిస్తామని ప్రతినబూని 'ఆపరేషన్ కగార్'కు శ్రీకారం చుట్టింది కేంద్రప్రభుత్వం.చెప్పినట్టుగానే ఇప్పటివరకు దాదాపు 500 మంది దాకా మావోయిస్టులను ఎన్ కౌంటర్ లలో హతమార్చి..లొంగుబాటపట్టించడంలో పైచేయిగా ఉన్నారు.ఇటీవల ఏకంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ్ రావు' ను అంతమొందించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు.ఆ ఎన్ కౌంటర్ లో హతమైన అమరవీరుల నెత్తుటి తడి ఆరకముందే 'శాంతి చర్చల ప్రతినిధి 'సుధాకర్' కూడా ఎన్ కౌంటర్ కావడం మావోయిస్టు పార్టీని షాక్ కు గురిచేసింది.ఇలా వరుసబెట్టి భద్రతా బలగాలు మావోయిస్టులపై మారణకాండ కొనసాగిస్తూ 'అడవిలో రక్తపుటేరులు' పారిస్తూనే ఉంది.ఇది ఇంక ఎక్కడ..? ఎప్పుడు ఆగుతుందో.? మరణమృదంగం మోగిస్తున్న పాలకులకే తెలియాలి!



నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శనివారం
7 జూన్ 2025
హైదరాబాద్






# జామీ ఓవర్టన్ రీఎంట్రీ

### టీమిండియాతో టెస్ట్ సిరీస్ కు ఇంగ్లాండ్ జట్టు ప్రకటన

టీమిండియాతో ఈనెల 20 నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుకు 14 మందితో కూడిన బృందాన్ని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ప్రకటించింది. ఈ జట్టులో పలువురు ఆటగాళ్లు రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ముఖ్యంగా జామీ ఓవర్టన్ గాయం నుంచి కోలుకుని ఈ టెస్టుకు అందుబాటులో ఉంటున్నాడు. అలాగే ఇటీవలే ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో దుమ్ము రేపిన జాకబ్ బెతెల్ కూడా పిలుపు వచ్చింది. వీరి రాకతో ప్లేయింగ్ లెవన్ ఎంపికపై టీమ్ మేనేజ్మెంట్ లో చిన్నగా తలనొప్పి మొదలైంది. వైట్ బాల్ క్రికెట్ లో రెగ్యులర్ ఆటగాడైన ఓవర్టన్ 2022లో న్యూజిలాండ్ పై అరంగేట్రం చేశాడు. ఆ టెస్టులో రెండు వికెట్లతో పాటు 97 పరుగులు చేసి, తాను ఆల్ రౌండర్ నని ఘనంగా చాటాడు. అయితే తొలి టెస్టుకు తను ఫుల్ ఫిట్ నెస్ తో ఉన్నాడా..? లేదా అనే విషయంపై స్పష్టత లేదు. ఇటీవల వెస్టిండీస్ తో జరిగిన మూడు వన్డేల సిరీస్ లో తను చేతిలేలి గాయంతో బాధపడ్డాడు. దాని నుంచి ఎప్పుడు కోలుకుని ఫుల్ ఫిట్ గా అవుతాడో క్లారిటీ లేదు. ప్రస్తుతం అతని పరిస్థితిని మెడికల్ టీమ్ అబ్జర్వ్ చేస్తున్నట్లు క్రికెట్ బోర్డు తెలిపింది. ఇక కౌంటీల్లో తనతోపాటే ఆడే మరో పేసర్ గస్ అట్కిన్సన్ ఈ స్క్వాడ్ లోకి గాయం కారణంగా ఎంపికవలేదు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన ఏకైక టటెస్టులో తను తొడ కండరాల గాయానికి గురయ్యాడు. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నాడు. భారత్ తో మ్యాచ్ కు మరో ఇద్దరు పేసర్లకు చోటు కల్పించారు. క్రిస్ వోక్స్ తోపాటు బ్రైడెన్ కార్స్ ను జట్టులోకి ఎంపిక చేశారు. అనుభవం కల వోక్స్.. మంచి బౌలింగ్ తో పాటు బ్యాటింగ్ కూడా చేయగలడు. ఇక కార్స్ కూడా ఆల్ రౌండర్ గా ఇప్పుడిప్పుడే నిరూపించుకుంటున్నాడు. ఇక వోక్స్ రాకతో శామ్ కుక్ డగౌట్ కే పరిమితమయ్యే అవకాశముంది. మరో ఎండ్ లో బెతెల్ రాకతో టాపార్డర్ లో ఒలీ పోప్, ఓపెనర్ జాక్ క్రాలీ స్థానాలకు ముప్పు ఎదు-రయ్యే అవకాశముంది. తను న్యూజిలాండ్ పై అరంగేట్రం చేసి 52కిపైగా సగటుతో మూడు అర్ధ సెంచరీలు సాధించాడు. అయితే ఇటీవలే జరిగిన జింబాబ్వేపై టెస్టులో ఈ ఇద్దరు సెంచరీలు చేయడం ఊరట. అనుభవానికి పెద్ద పీట వేస్తే, ఈ ఇద్దరికే తుది జట్టులో చోటు దక్కే అవకాశముంది. ఇక ఐదు టెస్టుల సిరీస్ లో భాగంగా తొలి మ్యాచ్ హెడింగ్లీతో జరుగనున్న సంగతి తెలిసిందే.

**భారత్ తో తొలి టెస్టుకు ఇంగ్లాండ్ జట్టు స్క్వాడ్:** బెన్ స్టోక్స్ (కెప్టెన్), షోయబ్ బషీర్, జేకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, జాక్ క్రాలీ, బెన్ డకెట్, జేమీ ఓవర్టన్, ఒల్లి పోప్, జో రూట్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), జాష్ టంగ్, క్రిస్ వోక్స్.

# చాహల్ గురించి ఆర్జే మహ్వాష్ భావోద్వేగ పోస్ట్



2025లో యుజ్వేంద్ర చాహల్ జట్టు పంజాబ్ కింగ్స్ ఫైనల్‌కు చేరుకుంది. కానీ విరాట్ కోహ్లీ జట్టు ఆర్సీబీ వారిని 6 పరుగుల తేడాతో ఓడించింది. 17 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆర్సీబీ ట్రోఫీని గెలుచుకుంది. అందువల్ల, దేశవ్యాప్తంగా సంబరాలు జరిగాయి. ఇంతలో, యుజ్వేంద్ర జట్టు ఓటమిపై గర్ల్‌ఫ్రెండ్ మహ్వాష్ తన బాధను వ్యక్తం చేసింది. మహ్వాష్ సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్‌ను షేర్ చేసింది. ఇప్పుడు ఈ పోస్టు వైరల్ అవుతోంది. చాహల్ మొత్తం సీజన్ గాయాలతో ఆడిన సంగతి చెప్పుకొచ్చింది. మహ్వాష్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఇప్పటివరకు చూడాని చాలా ఫొటోలను పంచుకున్నారు. ఈ చిత్రాల్లో ఆమె యుజ్వేంద్ర చాహల్, ప్రీతి జింటా, పంజాబ్ కింగ్స్ జట్టు ఆటగాళ్లతో వేర్వేరు ప్రదేశాల్లో దిగిన ఫొటోలు ఉన్నాయి. ఒక చిత్రంలో, ఆమె చాహల్, ప్రీతి ఇద్దరితో కనిపించింది.. ఈ చిత్రాలతోపాటు చాహల్ గురించి సోషల్ మీడియాలో మహ్వాష్ సుదీర్ఘమైన పోస్టు పెట్టారు. 'అతను పోరాడాడు, గట్టిగా నిలబడ్డాడు. చివరి మ్యాచ్ వరకు ఆడాడు. రెండో మ్యాచ్‌లోనే అతని పక్కటెముకలకు గాయాలు అయ్యాయి తరువాత బౌలింగ్ చేస్తున్నప్పుడు అతని వేలు విరిగిపోయిందని ప్రజలకు తెలియదు. కాబట్టి యుజ్వేంద్ర చాహల్ కోసం ప్రత్యేక పోస్ట్, ఈ వ్యక్తి మొత్తం సీజన్‌లో 3 ఫ్రాక్చర్లతో ఆడాడు. అతను నొప్పితో అరుస్తూ బాధపడుతున్న మనమందరం చూశాము కానీ అతను వెనక్కి తగ్గడం ఎప్పుడూ చూడలేదు.' మహ్వాష్ ఇంకా ఏం రాశారంటే, 'మీ వెంట పెద్ద యోధుడు ఉన్నాడు. జట్టు చివరి బంతి వరకు పోరాడుతూనే ఉంది. ఈ సంవత్సరం ఈ జట్టుకు మద్దతుదారుగా ఉండటం గౌరవంగా ఉంది. బాగా ఆడిన వారు, ఈ ఫొటోస్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ నా హృదయానికి దగ్గరగా ఉన్నారు. వచ్చే ఏడాది కలుద్దాం. అలాగే, టైటిల్ గెలుచుకున్నందుకు అభిమానులకు చాలా అభినందనలు..' అని ముగించారు.

# మా నాన్న నిరాశపడ్డాడు

### టీమ్‌ఇండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ




టీమ్‌ఇండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ సడెన్‌గా టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం క్రీడా ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురి చేసింది. రోహిత్ టెస్టులకు గుడ్? బై చెప్పడం తన ఫ్యాన్స్?కు అస్సలు నచ్చలేదు. అయితే ఈ నిర్ణయం అభిమానులనే కాదు, హిట్?మ్యాన్ తండ్రిని కూడా బాధ పెట్టింది. తన తండ్రికి వన్డే, టీ20 ఫార్మాట్ కంటే టెస్టు క్రికెటే ఎంతో ఆసక్తి అంట. ఈ విషయాన్ని రోహిత్ తాజాగా చెప్పాడు. అందుకే ఈ రిటైర్మెంట్?తో తన తండ్రి నిరాశ పడినట్లు తెలిపాడు.'మా నాన్న ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పని చేసేవారు. మా కెరీర్? కోసం ఆయన అనేక త్యాగాలు చేశారు. ఆయనకు టెస్టు క్రికెట్ అంటే చాలా ఇష్టం. నేను వన్డేలో 264 పరుగులు చేసినా, మా నాన్న పెద్దగా ప్రశంసించలేదు. అది నాకు ఇప్పటికీ గుర్తుంది. కానీ టెస్టు క్రికెట్‌లో 30, 40, 50, 60 పరుగులు చేసిన సందర్భాల్లో ఆ ఇన్నింగ్స్? గురించి నాతో కచ్చితంగా మాట్లాడేవారు. ఆయన టెస్టు ఫార్మాట్?పై ప్రేమ ఉందనేందుకు ఇదే నిదర్శనం. అందుకే నేను టెస్టు రిటైర్మెంట్ అనౌన్స్ చేయడం ఆయనకు నచ్చలేదు. కానీ తర్వాత ఆయన నా నిర్ణయాన్ని అంగీకరించారు' అని రోహిత్ శర్మ ముంబయిలో పాల్గొన్న ఈవెంట్?లో వివరించాడు. కాగా, 2014లో శ్రీలంకపై వన్డే మ్యాచ్?లో రోహిత్ 264 పరుగులు చేసి చరిత్ర సృష్టించాడు. కాగా, రోహిత్ గతనెల 07న టెస్టుల నుంచి తప్పుకుంటున్నట్లు అకస్మాత్తుగా ప్రకటన చేశాడు. ఈనెలలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్తాడని భావించిన క్రమంలో రోహిత్ నిర్ణయం అందర్నీ షాక్?కు గురి చేసింది. 2013లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన హిట్?మ్యాన్ 12ఏళ్లు టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు.సుదీర్ఘ టెస్టు కెరీర్?లో భారత్ తరపున రోహిత్ 67 మ్యాచ్?లు ఆడాడు. అందులో 40.58 సగటున 4301 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 88 సిక్స్?లు బాదాడు. గతేడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియాపై చివరి టెస్టు ఆడాడు. 2024లోనే టీ20లకు కూడా రిటైర్మెంట్ ఇచ్చేసిన రోహిత్ ఇకపై వన్డేల్లోనే కనిపించనున్నాడు.

# రోహిత్ శర్మనే నాకు ఆదర్శం

### యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్




టీమిండియా క్రికెట్‌లో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఇటీవల టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్, గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో తన భావాలను బహిరంగంగా పంచుకున్నాడు. ఈ సమావేశంలో గిల్‌తో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా పాల్గొన్నారు. ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో జరిపిన ఈ సమావేశంలో శుభ్‌మన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. గిల్మాట్లాడుతూ, రోహిత్ శర్మ తరహాలోనే ఆటగాళ్ల కెప్టెన్‌గా ఉంటానని టీమిండియా నయా సారథి తెలిపాడు. టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ సవాల్‌తో కూడుకున్నదని, ఈ ఛాలెంజ్‌ను స్వీకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. కెప్టెన్‌గా ప్రత్యేకమైన శైలిని అనుసరించానని స్పష్టం చేశాడు. ఆటగాళ్లలో భద్రతభావాన్ని కలిగిస్తానన్నాడు. ఇంగ్లండ్ పర్యటన నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తో కలిసి శుభ్‌మన్ గిల్ గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఇంగ్లండ్ పర్యటనను ఉద్దేశించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. గిల్ మాట్లాడుతూ, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో లేకపోతే అతని స్థానాన్ని భర్తీ చేయగల ఆటగాళ్లు జట్టులో ఉన్నారని గిల్ తెలిపాడు. 'భారత జట్టులో నాణ్యమైన పేసర్లు ఉన్నారు. మా పేస్ విభాగం బలంగా ఉంది. మా పేసర్లు ఎలాంటి స్థితిలోనైనా రాణించి జట్టును గెలిపించగలరు.కెప్టెన్‌గా నేను ప్రత్యేకమైన శైలిని అనుసరించను. రోహిత్ శర్మ తరహాలోనే ఆటగాళ్లకు అండగా ఉంటూ వారితో సత్సంబంధాలు పెంచుకుంటా. వారితో మాట్లాడుతూ భద్రతాభావాన్ని కలిగిస్తా. వాళ్లతో వాళ్ల బలాలు, బలహీనతల గురించి చర్చిస్తా. ఓ సారథిగా ఇది చాలా ముఖ్యం. భద్రతా భావం కలిగినప్పుడే ఆటగాళ్లు నూరు శాతం కష్టపడతారు. ఇంగ్లండ్ పర్యటనలో బ్యాటర్‌గా జట్టును ముందుండి నడిపించాలని భావిస్తున్నా. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సుదీర్ఘ కాలం భారత జట్టుకు ఆడి ఎన్నో విజయాలు అందించారు. వారి స్థానాలను భర్తీ చేయడం చాలా కష్టం.అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు. జూన్ 20 నుంచి టీమిండియా ఇంగ్లండ్ పర్యటన ప్రారంభం కానుంది. లీడ్స్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్‌తోనే డబ్ల్యూటీసీ 2027 ఎడిషన్ కు తెరలేవనుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేకుండా టీమిండియా ఇంగ్లండ్‌లో పర్యటించనుంది. దాంతో ఈ సిరీస్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసాలే అరెస్ట్

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మేనేజ్ మెంట్ కు బిగ్ షాక్ తగిలింది. జూన్ 4 బుధవారం ఎం. చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాట ఘటనకు సంబంధించి బెంగళూరు పోలీసులు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసాలేను అరెస్టు చేశారు. నిఖిల్ సోసాలే బెంగళూరు నుండి ముంబైకి బయలుదేరినప్పుడు అరెస్టు జరిగింది. బెంగళూరు విమానాశ్రయంలో ఆయనను అరెస్టు చేశారు.నిఖిల్ తోపాటు విజయోత్సవ ఈవెంట్ నిర్వాహక సంస్థ డీఎన్ఏ ఎంటర్ టైన్ మెంట్ నెట్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన ముగ్గురు సిబ్బందిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఆర్సీబీ టీమ్ మేనేజ్ మెంట్ నిఖిల్ కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ విజయోత్సవ ఈవెంట్ను కూడా డీఎన్ఏ సంస్థతో కలిసి ఆయనే కోఆర్డినేట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. కాగా బుధవారం సాయంత్రం చిన్నస్వామి స్టేడియం దగ్గర జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన విషయం తెలిసిందే. 50 మందికిపైగా గాయపడ్డారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహణపై చేసిన భిన్నమైన ప్రకటనలే ఈ దుర్ఘటనకు ప్రధాన కారణమని సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. అందర్నీ ఏకకాలంలో అనుమతించడం వల్లే ఈ తొక్కిసలాట జరిగిందని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. కర్నాటక హైకోర్టు కూడా ఈ ఘటనను సుమోటోగా పరిగణించి విచారణ చేపట్టింది. లక్షలాది మంది క్రీడాభిమానులతో ముడిపడిన కార్యక్రమాన్ని నిర్వహించడంలో వైఫల్యం ఎవరిదో తేల్చి చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కోర్టు సూచనతో రాష్ట్ర ప్రభుత్వం తొక్కిసలాట ఘటన దర్యాప్తునకు సీఐడీ పోలీసులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఘటనకు కర్నాటక క్రికెట్ సమాఖ్య, ఆర్సీబీ ప్రతినిధులను బాధ్యులుగా పేర్కొంటూ వెంటనే అరెస్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా అరెస్టులు చోటుచేసుకుంటున్నాయి.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..







# హరిహర వీరమల్లు మరోమారు వాయిదా

## అధికారికంగా ప్రకటించిన చిత్ర బృందం

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తోన్న సరికొత్త చిత్రం 'హరిహర వీరమల్లు'. అనుకున్నట్ఉలగానే వాయిదా పడింది. ఇప్పటికే ఈ సినిమా పలుమార్లు వాయిదా పడిన విషయం తెలిసిందే. జూన్ 12న ఇది విడుదలవుతుందని భావించిన అభిమానులకు మరోసారి నిరాశ ఎదురైంది. 'హరిహర వీరమల్లు' మరోసారి వాయిదా పడినట్లు టీమ్ మరోఆరు అధికారికంగా ప్రకటించింది. అచంచలమైన ఓపిక, నమ్మకంతో 'హరిహర వీరమల్లు' సినిమాకు తోడుగా నిలిచిన అభిమానులు, శ్రేయోభిలాషులు, సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. గతంలో ప్రకటించిన విధంగా జూన్ 12వ తేదీకి ఈ చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాం. ఎంతో శ్రమించినప్పటికీ వివిధ కారణాల వల్ల ఆ రోజు సినిమాని విడుదల చేయలేకపోతున్నాం. కష్టమైనప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవన్ కల్యాణ్ ఇమేజ్‌ను దృష్టిలోఉంచుకుని దీనిని మరింత గొప్పగా తీర్చిదిద్దాలనేది మా ఆలోచన. ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాం. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాం. మీ ఎదురుచూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాం అని టీమ్ ప్రకటించింది. సోషల్‌మీడియా వేదికగా జరిగే ప్రచారాలను ఏమాత్రం నమ్మవద్దని కోరింది. సినిమాకు సంబంధించిన విషయాలను తామే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పింది. అంతేకాకుండా త్వరలోనే ట్రైలర్ రిలీజ్ కానుందని.. కొత్త విడుదల తేదీని కూడా ప్రకటిస్తామని టీమ్ వెల్లడించింది. హిస్టారికల్ యాక్షన్ మూవీగా ఈ సినిమా సిద్ధమవుతోంది. నిధి అగర్వాల్ కథానాయిక. మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో సాగే కథ ఇది. కీరవాణి స్వరాలు అందిస్తున్నారు. రెండు భాగాల్లో దీనిని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.





# వైవాహిక బంధంలోకి నటుడు అఖిల్

## 8న అన్నపూర్ణలో వివాహ విందు

తన బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేశారు నటుడు అఖిల్ అక్కినేని. శుక్రవారం తెల్లవారుజామున ఆయన వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియురాలు జైనబ్ రవ్జీతో ఆయన వివాహం వేడుకగా జరిగింది. హైదరాబాద్‌లోని నాగార్జున నివాసంలో జరిగిన ఈ వివాహ వేడుకకు కుటుంబసభ్యులు, అత్యంత సన్నిహితులు, చిరంజీవి కుటుంబం, రాజమౌళి తనయుడు కార్తికేయ, దర్శకుడు ప్రశాంత్ నీల్, నటుడు శర్వానంద్‌తోపాటు పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. జూన్ 8న రిసెప్షన్ జరగనుంది. అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరగనున్న ఈ వివాహ విందుకు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. దిల్లీకి చెందిన జైనబ్ థియేటర్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా. ఇండియాలోనే కాదు దుబాయ్, లండన్‌లోనూ ఆర్టిస్ట్‌గా ఆమె రాణించారు. రెండేళ్ల క్రితం అఖిల్‌తో మొదలైన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో ఒక్కటయ్యారు. జైనబ్ తండ్రి జుల్ఫీ రవ్జీ, నాగార్జున కుటుంబాల మధ్య కొన్నేళ్లుగా స్నేహబంధం ఉంది. అంతకుముందు అఖిల్ ఎంగేజ్మెంట్ జరిగినా పెళ్లి దగ్గర ఆగిపోయింది.



## అమ్మ నిజంగా దేవకన్యనే..!

'జగదేకవీరుడు అతిలోక సుందరి' చిత్రం ఇటీవలే రీరిలీజ్ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన తల్లి, దివంగత శ్రీదేవిని గుర్తుచేసుకుంటూ ఆమెకు నివాళిగా జాన్వీకపూర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది. 'జగదేకవీరుడు అతిలోక సుందరి' పోస్టర్స్ ముద్రించిన డెనిమ్ జాకెట్‌ను ధరించి..ఆ ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'కొద్దిరోజుల క్రితమే రీరిలీజ్ వెర్షన్‌ను చూశాను. అద్భుతంగా అనిపించింది. అమ్మను చూస్తుంటే నిజంగా దేవకన్యలా అనిపించింది. తన ముద్దుముద్దు మాటలు, చేష్టలు అబ్బురపరిచాయి. చిరంజీవిగారి కామెడీ హైలైట్. ఇంత గొప్ప చిత్రాన్ని అందించిన దర్శకులు రాఘవేంద్రరావుగారి విజన్‌కు హ్యాట్సాఫ్' అని రాసుకొచ్చింది. ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం జాన్వీకపూర్ తెలుగులో 'పెద్ది' చిత్రంలో నటిస్తున్నది.




## పొట్టి డ్రెస్ లో రెబా.. యమా అందంతో వారెవ్వా!

ముద్దుగుమ్మ, హీరోయిన్ రెబా మోనిక జాన్ గురించి అందరికీ తెలిసిందే. అందం, అభినయంతో తనకంటూ స్పెషల్ క్రేజ్ సంపాదించుకుంది అమ్మడు. తన యాక్టింగ్ అండ్ గ్లామర్ తో యూత్ లో మంచి ఫేమ్ రెబా సొంతం. అదే సమయంలో నెట్టింట బ్యూటీ ఫుల్ యాక్టివ్. ఎప్పటికప్పుడు ఆమె పిక్స్ వైరలవుతుంటాయి. తన ఫ్యాన్స్ అండ్ నెటిజన్లకు తరచూ ట్రీట్స్ ఇచ్చే రెబా.. ఇప్పుడు ఫారిన్ ట్రిప్ లో ఫుల్ ఎంజాయ్ చేస్తోంది. థాయిలాండ్ లో ప్రస్తుతం చిల్ అవుతున్న అమ్మడు.. లేటెస్ట్ గా సోషల్ మీడియాలో తన ట్రిప్ కు సంబంధించిన ఫోటోలు షేర్ చేసింది. ప్రస్తుతం అవి తెగ చక్కర్లు కొడుతున్నాయి. అందరినీ ఆకట్టుకుంటున్నాయి కూడా. "ఎప్పటి నుంచో ఫ్యామిలీ ట్రిప్ కు వెళ్దామనుకుంటున్నా. కానీ పోస్ట్ పోన్ అవుతుంది. ఎట్టకేలకు ఇప్పుడు వెళ్లాను. థాయ్ ల్యాండ్ లో ఎంతో హ్యాపీగా ఎంజాయ్ చేశాం. ఈ ట్రిప్ చాలా స్పెషల్. పుకెట్ లో బెస్ట్ థాయ్ ఫుడ్ ఆస్వాదించాం. పెర్ఫెక్ట్ టూర్ గైడ్ దొరికాడు. మా వైబ్, ఎనర్జీకి సరిపోయారు" అంటూ రాసుకొచ్చింది రెబా. అయితే రెబా పోస్ట్ చేసిన పిక్స్ లో తన ఫ్యామిలీ మెంబర్స్ ఉన్నారు. ఆమె మాత్రం తన అందంతో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. బ్లాక్ కలర్ పొట్టి డ్రెస్ లో సందడి చేసిన అమ్మడు ఇచ్చిన పోజులు చాలా క్యూట్ గా ఉన్నాయి. సూపర్ పిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. క్యూట్ మేడమ్ అంటూ నెట్టింట సందడి చేస్తున్నారు.

## అలా అనడం కరెక్ట్ కాదు

తెలుగు సినిమా అదృష్టంపై ఆధారపడే పరిశ్రమ. ఇక్కడ హిట్టే ముఖ్యం. విజయాలే ఇక్కడ అవకాశాలు తెచ్చిపెడుతుంటాయి. అందుకే ఉన్నంతలో విభిన్న కథల్ని ఎంచుకుంటూ ముందుకెళ్తున్నది తెలుగమ్మాయి రీతూ వర్మ. పాత్రల్లో వైవిధ్యాన్ని చూపిస్తూ తానుంటే సినిమాకెళ్లే ఆడియన్స్‌ని సంపాదించుకుంది. ఈమె నటించిన 'దేవిక అండ డానీ' అనే వెబ్ సిరీస్ నేటి నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రీతూ మాట్లాడుతూ 'సినిమా అనేది టీమ్ వర్క్.

హిట్టూ, ఫ్లాపూ ఒకరి చేతిలో ఉండదు. హిట్ అయితే క్రెడిట్ ఒకరే కొట్టేయడం, ఫ్లాప్ అయితే ఏ ఒక్క వ్యక్తినో నిందించడం సబబు కాదు. చాలాసార్లు ఫ్లాప్ అయితే హీరోహీరోయిన్లపై నిందలేస్తుంటారు. ఇంకా మాట్లాడితే గోల్డెన్ లెగ్, ఐరన్ లెగ్ అంటూ బిరుదులిచ్చేస్తుంటారు. తొలినాళ్లలో నేను నటించిన సినిమా సరిగ్గా ఆడకపోతే బాధపడేదాన్ని. ఇప్పుడైతే పట్టించుకోవడం మానేశా. సినిమా ఫలితం దైవాధీనం.. అంతే. ప్రస్తుతమైతే నా ఫోకస్ అంతా నటనపైనే. విభిన్నమైన పాత్రలు చేయాలనే కోరిక ఉంది' అని చెప్పుకొచ్చింది రీతూవర్మ.



Printed, Published and Owned by **K. SUDHAKAR,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 8-4-25, 2-32/1, MUTHANNAPET, BEJJANKI , DACHARAM, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SUDHAKAR. RNI NO : TGTEL/25/A0100** Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 966605221

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# మెడికల్ హెూల్ సేల్ అసోసియేషన్ అధ్యక్షునిగా కోటగిరి నరేష్ ఏకగ్రీవ ఎన్నిక



**నేటి సాక్షి - కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల మెడికల్ హెూల్ సేల్ అసోసియేషన్ అధ్యక్షునిగా రెండవసారి కూడా కోటగిరి నరేష్ (శ్రీ వెంకటేశ్వర మెడికల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు కోటగిరి నరేష్ మాట్లాడుతూ.. నాపైన నమ్మకంతో మరోసారి ఎన్నుకున్న సంఘ సభ్యులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ సంఘంలో ఎవరికి ఏ అవసరం వచ్చిన తాను ముందుండి వారి సమస్యలను పరిష్కరిస్తానని సభ్యులందరికీ హామీ ఇస్తున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, నాగరాజ్, కళ్యాణ్, దినేష్, సందీప్, వెంకటేష్, శ్రీధర్, రామకృష్ణ, వినోద్ పాల్గొని అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపారు

# విద్యుత్ షాక్ తో రైతు మృతి



**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 6:** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలంలో రైతు విద్యుత్ షాక్ తో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం పేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని చర్లపల్లి గ్రామంలో కరుణాకర్ రెడ్డి(45) తన వ్యవసాయ పొలం దగ్గర వెళ్లగా పొలంలో తెగిపడిన విద్యుత్ వైర్ ను తీసి వేస్తుండగా విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందినట్లు కర్ణాకర్ రెడ్డి భార్య వనజ ధన్వాడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ షాక్ తో కరుణాకర్ రెడ్డి మృతి చెందడం పట్ల చర్లపల్లి గ్రామంలో విషాదఛాయలు అల్ముకున్నాయి.

# బాలుర మృతి బాధాకరం

## చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు...



**నేటి సాక్షి, చిత్తూరు :**చిత్తూరు పార్లమెంటు పరిధిలోని వీ.కోట మండలం కృష్ణాపురం పంచాయతీ మోట్లపల్లికి చెందిన ముగ్గురు బాలురు చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందడం చాలా బాధాకరమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు శుక్రవారం విచారం వ్యక్తం చేశారు. అలాగే మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఉన్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు. స్థానిక టీడీపీ నేతల ద్వారా మోట్లపల్లికి చెందిన కుషాల్, నిఖిల్, జగన్ లు సరదాగా ఈతకెళ్లి మృతి చెందిన విషయం తెలుసుకొని దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా ఉండాలని నాయకులకు ఆయన సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసానిచ్చారాయన. అదేవిధంగా మృతుల కుటుంబీకులకు తన సంతాపాన్ని తెలియజేసారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఎంపీ దగ్గుమళ్ళ తెలియజేశారు

# విద్యార్థులను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలి




**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 6 :** బడిబాటపై గ్రామసభ మీటింగ్ పిఎంసి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మరికల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రధానోపాధ్యాయురాలు కె. నాగరత్నమ్మ గవర్నమెంట్ బడుల్లో విద్యార్థులను చేర్పించేందుకు గ్రామ యువకుల సహకారం కావాలని కోరడం జరిగింది మరియు స్కూల్లో ఈ విద్యా సంవత్సరం నుండి డిజిటల్ బోర్డ్ కంప్యూటర్ ల్యాబ్ రోబోటిక్స్ ల్యాబ్ ప్రారంభం అవుతుందని కూడా చెప్పడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మరియు ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ టీచర్లు ,గ్రామ యువకులు పాల్గొనడం జరిగింది.

# పేట ఎమ్మెల్యే చిట్టెంపర్నిక రెడ్డికి ఘన సన్మానం



**నేటి సాక్షి నారాయణపేట, జూన్ 6:** నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డికి శుక్రవారం తీలేరు పంప్ హౌస్ వద్ద మరికల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శాలువులతో ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మరికల్ మండల తాసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన రామకోటి ఆధ్వర్యంలో పేట ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. జిల్లా నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి, సుదర్శన్ రెడ్డి గొల్ల కృష్ణయ్య, బెల్లగుంది ఈరన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్న ముఠాలు అరెస్టు



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** రెండు వేర్వేరు సంఘటనల్లో అమాయక వ్యవసాయదారులను లక్ష్యంగా చేసుకోని ప్రముఖ కంపెనీల పేర్లతో పాటు గడువు తీరిన పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఏడుగురిని ప్రస్తుతం టాస్క్ఫోర్స్ మరియు పరకాల, గీసుగొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ రెండు ముఠాల నుండి పోలీసులు సుమారు 63లక్షల 62వేల రూపాయల విలువ గల నకిలీ, కాలం తీరిన పురుగు మందులు, 166 కిలోల నకిలీ విత్తనాలు, 8వందల లీటర్ల గడ్డి మందుతో పాటు, నకిలీ పురుగు మందుల తయారీకి అవసమయిన సామగ్రితో పాటు ఏడు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1) జయదీప్ గౌతమ్, వయసు 33, మేడ్చల్ మల్కాజిగిరి, 2) ముద్దంగుల ఆదిత్య ,వయసు 32, మోహిదీపట్నం హైదరాబాద్, 3) మాచబోయిన తిరుపతి, వయసు 35, నాగారం గ్రామం పరకాల మండలం. 4) అన్నం కుమారస్వామి ఇవయసు 42, పాపయ్యపల్లి చేల్పూర్ గ్రామం ములుగు ఘన్పూర్ మండలం. 5. బెరి రెడ్డి మగ్రి రెడ్డి, వయస్సు 42, ఎల్కతుర్తి హవేలీ,గీసుగొండ మండలం,వరంగల్ జిల్లా, 6. తుమ్మ గుండ్ల సందీప్ రెడ్డి, వయస్సు 37, సంగారెడ్డి జిల్లా, 7. తుమ్మగుండ్ల విజయ్ జోసెఫ్, వయస్సు 36, సంగారెడ్డి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడిస్తూ..పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు టాస్క్ఫోర్స్ మరియు పరకాల పోలీసులు, వ్యవసాధికారులు సంయుక్తంగా కలిసి ప్రధాన నిందితుడు నాగారం చెందిన మాబొయిన తిరుపతి ఇంటిపై పోలీసులు దాడి చేసి నకిలీ, కాలం తీరిన పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకొని నిందితుడిని పోలీసులు విచారించగా నిందితుడు ఇచ్చిన సమచారంతో పోలీసులు హైదరాబాద్‌లో మోహిదీపట్నం ప్రాంతంలో నకిలీ పురుగు మందులు తయారు చేస్తున్న గొదాంపై దాడి చేసి పోలీసులు సుమారు 57లక్షల 44వేల రూపాయల నకిలీ,కాలం తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకోవడంతో పాటు జయదీప్ గౌతం, ఆదిత్య, కుమార స్వామిలను పోలీసులు అరెస్టు చేసారు. మరో సంఘటనలో పోలీసులకు అందిన సమాచారంతో గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్కతుర్తి హవేలీ ప్రాంతంలో బెరి రెడ్డి మగ్రి రెడ్డి ఇంటిపై దాడి చేసి ఒక కిలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని పోలీసులు విచారించగా నిందితుడు ఇచ్చిన సమాచారం సంగారెడ్డి జిల్లా చింతల చేరువు గ్రామానికి చెందిన తుమ్మగుండ్ల సందీప్ రెడ్డి, తుమ్మగుండ్ల విజయ్ జోసెఫ్ ఇండ్ల సుమారు 6లక్షల 18వేల రూపాయల విలువ గల 166 కిలోల నకిలీ విత్తనాలతో పాటు 8వందల లీటర్ల గడ్డి మందును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు. నిందితులను పట్టు కొవడంలో ప్రతిభ కనబరిచన టాస్క్ఫోర్స్ ఏసిపి మధుసూధన్, పరకాల, మామూనూర్ ఏసిపి వెంకటేష్ లు సతీష్ బాబు, ఇన్స్పెక్టర్లు బాబులాల్, సార్లరాజు, రంజిత్, పరకాల ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, ఏఏఓ సల్మాన్ పాషాతో పాటు, టాస్క్ఫోర్స్,పరకాల పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్.ఐలు, ఇతర పోలీస్ సిబ్బందిని పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఒత్తిడి లేని చదువులకు ప్రాధాన్యత నివ్వాలి

## తుడా చైర్మన్ చమరపాకు దివాకర్ రెడ్డి




**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** తిరుపతి భవాని నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కేమ్ బ్రిడ్జ మాంటోరీస్ గ్లోబల్ కిడ్స్ స్కూల్ ను శుక్రవారం తుడా చైర్మన్ చమరపాకు (డాలర్స్)దివాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ కేజే ప్రదీప్ , వైస్ చైర్మన్ ఇందుమతి డాలర్స్ దివాకర్ రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికారు. ఐఏఎస్ అధికారి రాష్ట్ర అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ డిప్యూటీ సెక్రటరీ హరిత, డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ లతో కలిసి డాలర్స్ దివాకర్ రెడ్డి క్లాస్ రూమ్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో పిల్లలకు మాంటోరీస్ ఎడ్యుకేషన్ ను అందించాలన్న సంకల్పంతో మొదటిసారిగా తిరుపతిలో పిల్లల కోసం ప్లే స్కూల్ తో పాటు బేబీ కేర్ సెంటర్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తమ పిల్లలను ఇక్కడ జాయిన్ చేసి ఉద్యోగాలు ఇతర పనులను చేసుకోవచ్చని తెలియజేశారు. పిల్లల అభిరుచిని తెలుసుకుని అందుకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దే మాంటోరీస్ ఎడ్యుకేషన్ రావడం సంతోషంగా ఉందన్నారు. స్కూల్ చైర్మన్ ప్రదీప్ నగరంలో మరిన్ని స్కూల్ బ్రాంచ్ లు ప్రారంభించాలని ఆకాంక్షించారు.

# నగరంలో ఫుట్ పాత్ లపై ఉన్న షాపులను, బండ్లను తొలగించండి

## కమిషనర్ ఎన్.మౌర్య




**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** నగరంలోని ఫుట్ పాత్ లపై అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసిన షాపులను, బండ్లను తొలగించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం నగరంలోని 36 వ వార్డులోని గిరిపురం, రాజన్న పార్కు రామచంద్ర పుష్కరిణీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో పాదచారులకు ఇబ్బందికరంగా ఫుట్ పాత్ లపై దుకాణాలు, బండ్లు పెట్టి వ్యాపారాలు చేయడంతో పాదచారులకు ఇబ్బందికరంగా మారిందనే పిర్యాదులు ఎక్కువయ్యాయని అన్నారు. ప్లానింగ్ అధికారులు నగరంలోని ఫుట్ పాత్ లపై ఉన్న షాపులను, బండ్లను తొలగించాలని అన్నారు. ఎవరైనా ఫుట్ పాత్ లు ఆక్రమించి షాపులు పెడితే అపరాధ రుసుములు విధించాలని అధికారులను ఆదేశించారు. రాజన్న పార్కులో పాడైన ఆట వస్తువులను మరమ్మత్తులు చేయాలని, పెయింటింగ్స్ వేయించి శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట తుడా ఈ.ఈ. రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు వెంకట ప్రసాద్, మధు, శిల్ప, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

# ఎంఈఓ ఆధ్వర్యంలో బడిబాట- గ్రామసభ



**నేటి సాక్షి, కోరుట్ల టౌన్ (గణేష్ గొల్లపల్లి) :** కోరుట్ల మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామపంచాయతీ ఆవరణలో శుక్రవారం బడిబాట గ్రామసభ కార్యక్రమం విలేజ్ స్పెషల్ ఆఫీసర్ ఎంఈఓ గంగుల నరేషం ఆధ్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అంగన్వాడీల్లోని బడీడు పిల్లలను గుర్తించి మరియు డ్రాపవుట్ ను గుర్తించి పాఠశాలలో నమోదు చేయడం మరియు ఉల్లాస్ కార్యక్రమం గురించి సవివరంగా విలేజ్ స్పెషల్ ఆఫీసర్ గంగుల నరేషం సమావేశంలో వివరించారు. ఈరోజు నుండి ప్రతిరోజు గ్రామంలో డోర్ టు డోర్ సర్వే ద్వారా మరియు ప్రభుత్వం ఇచ్చిన బడిబాట షెడ్యూల్ ప్రకారం పాఠశాల ప్రవేశాలు ఉంటాయని అన్నారు. అనంతరం ప్రభుత్వం సెర్ఫ్ ద్వారా కుట్టించిన స్కూల్ యూనిఫామ్స్ ను పాఠశాల ఉపాధ్యాయ బృందానికి సెర్ఫ్ ఏపీఓ శంకర్ అందించారు. ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువు పూర్తి చేసుకున్న విద్యార్థుల రికార్డు షీట్స్ మరియు బోనఫైడ్ సర్టిఫికెట్లను హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గంగుల నరేశం అందించడం జరిగింది. అనంతరం హాజరైన అధికారులందరితో బడిబాట ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో గ్రామ మాజీ సర్పంచ్ గుగ్గిళ్ళ తుకారం గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ళ సురేష్ గౌడ్, ఉప సర్పంచ్ ఆరె రాజం, పంచాయతీ సెక్రెటరీ పృథ్వీ, నాయకులు ముక్కెర లింబాద్రి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావికంటి పవన్ కుమార్, సెర్ఫ్ ఏపీఓ శంకర్, ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు చిప్ప భాస్కర్, గంగుల రణధీర్, చాంద్ ఖాన్, బాసరాజ గోపాల్, ఎండి రవూఫ్, మంచి కట్ల నాగరాజు, నగేష్, అంగన్వాడి ఇన్స్ట్రక్టర్స్ మంజుల, గీత, ఆశ వర్కర్లు చంద్రకళ, లయ, రాధ, వివివోలు మాధురి, షమీనా తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..
శనివారం
7 జూన్ 2025


# ఘనంగా సూర్య మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**హాజరైన పేట ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి**

**నేటి సాక్షి, నారాయణపేట జూన్ 6 :** నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మరికల్ మండల కేంద్రంలో కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పరిణికా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శాలువాలతో సూర్య మోహన్ రెడ్డికి ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఈ సందర్భంగా పేట ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి మాట్లాడుతూ సూర్య మోహన్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని భగవంతుడి ఆశీర్వాదం ఉండాలని ఆమె కోరారు. అనంతరం కార్యకర్తల ఆధ్వర్యంలో ధన్వాడ మరికల్ నారాయణపేట జిల్లా కేంద్రం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. శాలువాలు పూలమాలలతో ఘన సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు అంతకుముందు మరికల్ పట్టణంలోని జిల్లా నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పేట మరికల్ ధన్వాడ మండలంలోని వివిధ గ్రామాల మండల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.



# కోయిల్ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు విడుదల

- **కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు సంక్షేమ పథకాలు**
- **నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి**

**నేటి సాక్షి ,నారాయణపేట ,జూన్ 6 :**కోయిల్ సాగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా శుక్రవారం నారాయణపేట నియోజకవర్గం ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట నియోజకవర్గం లోని మరికల్ మండల పరిధిలోని తీలేరు పంప్ హౌస్ ద్వారా సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టెం పరిణికా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే రైతులకు సంక్షేమ పథకాలు అందయని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే తాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసి రైతులు పంటలు పండించేందుకు సాగునీరుని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దారు రామకోటి, ఆర్ ఐ సుధాకర్ రెడ్డి, పేట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి, మరికెల్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బెలుగుంది వీరన్న, గోటూరు నాగేశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి బసిరెడ్డి రాజారెడ్డి మల్ రెడ్డి సుదర్శన్ రెడ్డి రామాచారి కృష్ణారెడ్డి వెంకట్రెడ్డి సయ్యద్ నరహరి, మరికల్ మాజీ ఎంపిటిసి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# పది పరీక్షల నిర్వహణలో కూటమి ప్రభుత్వం విఫలం

- **పది పరీక్షల నిర్వహణలో కూటమి ప్రభుత్వం విఫలం**
- **పేద విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ, గురుకులాల్లో తీరని నష్టం**
- **ఏలాంటి ఫీజు లేకుండా రీవాల్యుయేషన్ చేయాలి**
- **వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు డిమాండ్**

**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :**పదవ తరగతి పరీక్షల నిర్వహణలో కూడా కూటమి ప్రభుత్వం ఫెయిల్ అయ్యిందని వైఎస్ఆర్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంకు చేరుకున్న ఆయన ఓ వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల తీరని నష్టం జరిగిందన్నారు. పరీక్షలు నిర్వహించడం చేతకాకుండా పిల్లల జీవితాలతో ఆడుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఇటు పాలకులు, అటు విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్ట్రంలో 6.14లక్షల మంది విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాస్తే, జవాబు పత్రాలను సరిగ్గా దిద్ది, పారదర్శకంగా ఫలితాలు వెల్లడించలేక పోవడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం చేసిన తప్పిదాలకు విద్యార్థులు, తల్లిదండ్రులకు మానసిక క్షోభ తప్పలేదన్నారు. ప్రభుత్వ తప్పిదంతో ప్రతి విద్యార్థి తన మార్కుల జాబితాపై అనుమానం వ్యక్తం చేసే పరిస్థితి వచ్చిందన్నారు. ట్రిపుల్ ఐటీ, గురుకుల జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు పొందలేక విద్యార్థులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం తన తప్పిదాన్ని అంగీకరించి ఎలాంటి ఫీజు లేకుండా రీవాల్యుయేషన్ చేయించాలని, తుది ఫలితాలు వచ్చేంత వరకు పదవ తగరతి మార్కుల ప్రాతిపదికగా చేస్తున్న అడ్మిషన్లను నిలుపుదలచేయాలన్నారు. జవాబు పత్రాలు దిద్దడంలో చోటు చేసుకున్న తప్పులకు బాధ్యులైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి విద్యా శాఖ ఉన్నత స్థాయి అధికారుల వరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ వినతిపత్రం ఇచ్చిన వారిలో వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల్‌రెడ్డి, వైవీ-పాళెం పార్టీ అధ్యక్షులు నాగార్జునరెడ్డి, చంద్రగిరి నియోజక వర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు చెంగల్‌రెడ్డి, కుప్పం నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు సురేష్, విద్యార్థి విభాగం నుంచి వచ్చిన వివిధ మండలాల అధ్యక్షులు హరి, వినోద్, యశ్వంత్, రఫి, ఓంప్రకాష్‌రెడ్డి, రాజారెడ్డి, చరణ్‌రెడ్డి, జగన్ రెడ్డిలు వున్నారు.



# జర్నలిస్టుల పిల్లలకి ఫీజు మినహాయించాలి

- **టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు**
- **జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ శ్రీరామ్ మొండయ్యకు వినతి**

**నేటి సాక్షి-కరీంనగర్:** కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు మినహాయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ శ్రీరామ్ మొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ... జర్నలిస్టులు సరైన వేతనాలు లేక కనీస ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక మంది జర్నలిస్టులు విద్యార్థుల ఫీజులు చెల్లించలేని పరిస్థితులలో ఉన్నారన్నారు. జిల్లాలో అనేకమంది విలేకరులు జర్నలిజంలో నిబద్ధతతో పని చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో గుర్తింపు పొందిన జర్నలిస్టు పిల్లలకు జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా ఫీజు మినహాయింపు కల్పించాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్యను అందించే విధంగా ఆదేశాలు జారీ చేసి జర్నలిస్టులకు అండగా నిలవాలని డిఈవో కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయం పై డిఈవో సానుకూలంగా స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య, కొమ్ము గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ శంకర్, జర్నలిస్ట్ నాయకులు గౌతమ్, జి నరేష్, సుదర్శన్ రెడ్డి, ఆర్ శంకర్ రెడ్డి, జి కిరణ్, దీక్షిత్, తిరుపతి, ఎం సతీష్, ఏ అనిల్, తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ పోటీలు ప్రారంభించిన గ్రామ పెద్దలు



**నేటి సాక్షి ప్రతినిధి గద్వాల్ : ( రమేష్ ) :** కేటిదొడ్డి మండలం కొండాపురంలో మారెమ్మ ఉత్సవాలు, ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. శుక్రవారం గ్రామ శివారులోని క్రికెట్ ప్రాంగణంలో పోటీలను బహుమతి దాతలు భీమిరెడ్డి, మహానంది రెడ్డి, మురళి తదితరులు ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు కాసేపు సరదాగా క్రికెట్ ఆడారు. ఆటలతో స్నేహ సోదర భావాలు ఉల్లాసం, ఉత్తేజాన్ని పెంపొందించాలన్నారు.

## ఫారెస్ట్ రోడ్లకు పర్మిషన్ ఇవ్వండి.



**నేటి సాక్షి, కోటపల్లి:** హైదరాబాద్ లోని బిజెపి పార్టీ కేంద్ర కార్యాలయంలో డీకే అరుణ పార్లమెంట్ సభ్యురాలిని కలసి, ఇంతకుముందు కేంద్ర మంత్రులకు వివిధ పనుల కొరకు మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ , ప్రస్తుత మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ , కోటపల్లి మండల ఫారెస్ట్ క్లియరెన్స్ కొరకు మరియు ఎంఎన్ఆర్ఇ జిఎస్ నిధుల కొరకు ఇచ్చిన వినతి పత్రాలను మళ్లీ తమరి ద్వారా కేంద్ర మంత్రులు దృష్టికి పంపించి ఆ పనులు చేయించాలని కోటపల్లి మండలం మాజీ మండల అధ్యక్షురాలు మంత్రి సురేఖ బిజెపి పార్టీ మండల ఉపాధ్యక్షుడు మంత్రి రామయ్య విజ్ఞప్తి చేసారు. సానుకూలంగా స్పందించిన డీ కే అరుణ వీటికి సంబంధించిన మంత్రులకు పంపిస్తానని చెప్పారని, ఫారెస్ట్ రోడ్ల పర్మిషన్ గురించి రాష్ట్ర ప్రభుత్వము నుండి కేంద్ర ప్రభుత్వంకు రోడ్ల పర్మిషన్ కొరకు రాసిన లెటర్ తీసుకొని రమ్మని తెలియజేసినారని ఒకవేళ కేంద్ర ప్రభుత్వంలో పెండింగ్ గనుక ఉంటే క్లియర్ చేయించి పర్మిషన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారని మంత్రి రామయ్య తెలిపారు.

## విద్య సంవత్సరానికి అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలి



**నేటి సాక్షి ప్రతినిధి గద్వాల్ : ( రమేష్ ) :**కేటి దొడ్డి మండల పరిధిలోని కూచినేర్ల గ్రామంలో శుక్రవారం సి ఆర్ పి ఎఫ్ యూత్ ఆధ్వర్యంలో తెలంగాణ రేవంత్ సర్కార్ విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని కూచినేర్ల గ్రామంలో సీ ఆర్ పి ఎఫ్ యూత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సి ఆర్ పి ఎఫ్ కన్వీనర్ రంగన్న మాట్లాడుతూ : కూచినేర్ల మండల పరిషత్ హై స్కూల్ లో పాఠశాలలో చదివి విద్యార్థుల సంఖ్య 436 విద్యార్థులు చదువుతున్నారు విద్యార్థులకు పాఠాలు బోధించడానికి 16 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు ఇంకా 8 మంది ఉపాధ్యాయులు అవసరం ఉన్నది కావున తెలంగాణ ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని అదేవిదంగా బడికి రంగులు వేయాలి మౌలిక వస్తులు కల్పించాలని డిమాండ్ చేశారు తల్లిదండ్రులతో సంతకాల సేకరణ చేయడం జరిగింది పాలుగోనారు మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు యూత్ అధ్యక్షుడు విష్ణు పాల్గొన్నారు

## ఎమ్మార్వో శ్రీపాల్ రెడ్డి కి ఘన నివాళి



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :**శుక్రవారం ఉదయం గుండె పోటుతో పరమపదించిన హనుమకొండ మండల తహసీల్దార్ కర్ర శ్రీపాల్ రెడ్డి భౌతిక ఖాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య, అడిషనల్ కలెక్టర్, తహసీల్దార్ లు, అధికారులు. విధి నిర్వహణలో నిత్యం ప్రజల పక్షాన నిబద్ధతతో పనిచేసిన శ్రీపాల్ రెడ్డి మరణ వార్త చాలా బాధాకరమని ఎమ్మెల్యే నాయిని విచారం వ్యక్తం చేశారు. శ్రీపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

# జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు
- ఫెడరేషన్ సభ్యులకు గుర్తింపు కార్డుల పంపిణీ

**నేటి సాక్షి-కరీంనగర్:** జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా.. జర్నలిస్టుల సమస్యలను ఇంత వరకు పరిష్కరించలేదన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఫెడరేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ... మెజారిటీ జర్నలిస్టుల జీవన పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా గ్రామీణ విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత జర్నలిస్టులకు ఒరిగిందేమి లేదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కొత్త అక్రెడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కరీంనగర్, హుజురాబాద్ లో ఇచ్చిన ఇళ్ళ స్థలాల సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య, కొమ్ము గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ శంకర్, జర్నలిస్ట్ నాయకులు గౌతమ్, జి నరేష్, సుదర్శన్ రెడ్డి, ఆర్ శంకర్ రెడ్డి, జి కిరణ్, దీక్షిత్, తిరుపతి, ఎం సతీష్, ఏ అనిల్, తదితరులు పాల్గొన్నారు.



# పలు పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం

**బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు**

**నేటి సాక్షి ప్రతినిధి గద్వాల్ : ( రమేష్ ) :** జోగులాంబ గద్వాల్ నియోజకవర్గంలోని కేటి దొడ్డి మండల పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం భాగంగా మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు మండల పరిధిలోని కొండాపురం . గంగనపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం సందర్భంగా గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రుల గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించారు అనంతరం కేటి దొడ్డి మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిఏటా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహిస్తుంది ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం : బడిబయట ఉన్న పిల్లలను చదువులకు దూరమవుతున్న పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలనేదే ముఖ్య ఉద్దేశం అని అన్నారు అనంతం గ్రామంలో ఉన్న పిల్లలను క్రమం తప్పకుండా గా ప్రతి ఒక్క పిల్లవాడిని పాఠశాలల్లో చేర్పించి ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పిల్లలను పాఠశాలలకు పంపాలని కోరారు అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయి అని గ్రామ పెద్దలకు విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేశారు పాఠశాలలు పున ప్రారంభానికి ముందే మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశామని పాఠశాలలు పున ప్రారంభం అయిన తర్వాత విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేస్తామని బడి బాట కార్యక్రమం సందర్భంగా గ్రామ పెద్దలకు విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేశారు జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు పున ప్రారంభం కానున్నాయి కావున ప్రతి ఒక్క పిల్లవాడిని బడిలో జరిపించే విధంగా అందరు కృషి చేయాలని కోరారు. జులై ఆగస్టు సెప్టెంబర్ నెలలో గ్రామాలలో విద్యార్థులను కాటన్ సీడ్ పత్తి కోసం పిల్లలను పొలాలకు తీసుకొని పోతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు ఎవరు కూడా పిల్లలను పాఠశాలకు దూరం చేయకుండా గా కాటన్ సీడ్ పత్తి కోసం పొలాలకు తీసుకొనిపోకుండగా గ్రామ పెద్దలు విద్యార్థి తల్లిదండ్రులు సహకరించాలని మీ పిల్లలు చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



**డ్రగ్స్ పై అవగాహన**

కేటి దొడ్డి మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో బడిబాట కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఉన్న యు-వతకు డ్రగ్స్ పైన కేటి దొడ్డి మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు గంజాయి డ్రగ్స్ మత్తు మందులు గుట్కాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచన చేశారు అదేవిధంగా ప్రతి ఒక్కరు గ్రామాల్లో చైతన్యం కల్పించాలని సూచించారు కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాల్, గంగంపల్లి ప్రధానోపాధ్యాయులు నరసింహులు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది సీఆర్పీలు యుగంధర్, పాపయ్య,శివరాజ్ , రంజిత్ పాల్గొన్నారు

# ఎడిటర్ రెహమాన్‌పై అక్రమ కేసు ఎత్తివేయాలి

**డిఎస్పి మొగులయ్యకు, కలెక్టరేట్ సూపరిండెంట్ కరుణాకర్ కు వినతి పత్రాలు అందజేత**

**నేటి సాక్షి ప్రతినిధి గద్వాల్ : ( రమేష్ ) :** అంబేద్కర్ చౌరస్తాలో నిరసన టి యు డబ్ల్యూ జే (ఐజేయు) జోగులాంబ గద్వాల జిల్లా అక్రమంగా అన్యాయంగా జనం సాక్షి ఎడిటర్ రహమాన్ పై కేసు నమోదు చేయడానికి నిరసిస్తూ శుక్రవారం టి యు డబ్ల్యూ జే ఐ జే యు జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి డీఎస్పీ మొగులయ్య, కలెక్టరేట్ సూపర్డెంట్ కరుణాకర్ వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి, రామకృష్ణ మాట్లాడుతూ.బుధవారం (ఈనెల నాల్గవ తేదీన) రోజున జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని ఆలంపూర్ నియోజకవర్గ రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం దగ్గర జరిగిన గొడవలో జనం సాక్షి, జనం టీవీ ఎడిటర్ రహమాన్ ను అన్యాయంగా, అక్రమంగా కేసు నమోదు చేసి ఎఫ్ ఐ ఆర్ లో ఏ2 నిందితునిగా చేర్చారు. వాస్తవంగా పత్రిక ఎడిటర్ నాల్గవ తేదీ బుధవారం రోజు హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నాడు. దీనికి తగ్గ సాక్షాలు ఉన్నాయి. కానీ ఫ్యాక్టరీ యజమాన్యం అన్యాయంగా, దుర్మార్గంగా ఈ కేసులో సంబంధంలేని వ్యక్తులపై ఫిర్యాదు చేసి ఇబ్బందులకు గురి చేసేలా చూస్తున్నారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నాం. గొడవలు సంబంధం లేని, సంఘటన స్థలం దగ్గర లేని పత్రిక ఎడిటర్ పై అక్రమ కేసులు ఎత్తివేయాలి. దీనిపై ఎంక్వయిరీ చేసి మమ్మల్ని ఒక వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీవీ వెంకటేష్, ఆంధ్రప్రభ మధు, ఏబీఎన్ పురేందర్, హరికృష్ణ, మన తెలంగాణ ముస్తఫా, సిరాజ్, 4 టీవీ ఇబ్రహీం, చుక్క సుదర్శన్, కిరణ్ జహీర్, ఇస్మాయిల్, ఆనంద్, మూర్తి, సంగమేశ్వరప్ప, రామాంజనేయులు, నరసింహులు, మహబూబ్, గోపాల్, రఘు తదితరులు పాల్గొన్నారు.పి. రవీందర్ రెడ్డి టీయూడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడు, జోగులాంబ గద్వాల జిల్లా.రామకృష్ణ టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) జిల్లా ప్రధాన కార్యదర్శి



# భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం

- మీసేవా రసీదులు భద్రపరుచుకొండి
- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

**నేటిసాక్షి, రాయికల్ :** సాదా బైనామా ద్వార భూములు పరిష్కరించుకునే రైతులు ఇది వరకు మీ సేవాలో దరఖాస్తులు చేసారని అట్టి రసీదులను భద్రపరుచుకోవాలని జగిత్యాల కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. రాయికల్ మండలం వీరాపూర్, దావన్పెల్లి గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆయన సందర్శించారు. స్థానిక రైతులతో భూసమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇదివరకు రైతులు సాదా బైనామా కోసం మీ సేవాలో దరఖాస్తు చేసకున్నారని అట్టి రసీదులను సాదా బైనామా కాగితాల జిరాక్సును రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు అందించాలన్నారు. రెవెన్యూ సదస్సుల వల్ల ప్రతి రైతు భూ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. స్థానిక అధికారులు భూ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అట్టి దరఖాస్తుకు పరిష్కారం చూపాలన్నారు. రెవెన్యూ అధికారులు సమ-ర్థవంతంగా పనులు చేసి రైతుల మెప్పు పొందాలన్నారు. వీరి వెంట జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, తహసీల్దార్ నాగార్జున, ఆర్ఐలు పద్మయ్య, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని పరామర్శించిన మాజీ మంత్రి



**నేటి సాక్షి ప్రతినిధి వనపర్తి జిల్లా :** వనపర్తి మండలం ,రాజపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త తెలుగు పెంటయ్య అనారోగ్యం తో ఉండడం తెలుసుకొని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి వారి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొని మనో ధైర్యం చెప్పారు. అదే గ్రామానికి చెందిన మాజీ గ్రామ అధ్యక్షులు బక్క బాలరాజు కుమారుడు గత కొద్ది రోజుల క్రితం ఆక్సిడెంట్ కావడంతో వారి నివాసానికి వెళ్లి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి యొక్క ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకొని నేనున్నాను అని పరావ ఁర్శించారు. మీకు ఎల్ల వేళల నేను మీకు తోడు ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మండల పార్టీ అధ్యక్షుడు కె. మాణిక్యం, సింగల్ విండో అధ్యక్షులు రఘు వర్ధన్ రెడ్డి, నాయకులు సుదర్శన్ రెడ్డి, మాజీసర్పంచులు జ్యోతి మాధవ రెడ్డి , నారాయణ, డేగ మహేశ్వర్ రెడ్డి, సంపత్ కుమార్ రెడ్డి, చిట్యాల రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కస్పే సతీష్ కుమార్ కు ఘన సన్మానం



**నేటి సాక్షి, నారాయణపేట, జూన్ 6:** శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో మన మరికల్లో 22 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం వేసవికాలంలో ప్రజల కోసం అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తున్నటువంటి కస్పే సతీష్ కుమార్ గారికి మరికల్ యువకమండలి మాజీ అధ్యక్షులు పెంటమీది రవి కిరణ్, మరికల్ యువకమండలి మాజీ ప్రధాన కార్యదర్శి కాటేకొండ రఘు, మరికల్ యువకమండలి మాజీ ఉపాధ్యక్షులు కూసురు రవి తదితరులు శాలువాతో సన్మానించడం జరిగింది. ప్రజల్ల శ్రేయస్సు కోసం మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని మనస్ఫూర్తిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.

## భూభారతితో భూ సమస్యలు పరిష్కారం



**నేటి సాక్షి, మెట్ పల్లి రూరల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వడి కృష్ణారావు అన్నారు.మెట్ పల్లి మండలం కొండ్రికర్ల గ్రామంలో శుక్రవారం జరిగిన భూభారతి అవగాహన సభలో రెవెన్యూ అధికారులతో కలిసి పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి చట్టం ద్వారా పేద మధ్యతరగతి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రైతులకు అన్యాయం జరగకుండా పటిష్టమైన చట్టం తీసుకొస్తామని తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని దానికి అనుగుణంగానే ఈ రోజు రాష్ట్రంలో భూభారతి చట్టాన్ని తీసుకొని రావడం జరిగింది అని ప్రజలందరూ దీన్ని ఉపయోగించుకోవాలని కోరారు. స్థానిక మాజీ సర్పంచ్ పుల్ల కిష్ట గౌడ్, జగిత్యాల జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడు బెజ్జారపు భూమాచారి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తీపిరెడ్డి అంజిరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గడ్డం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి నెట్ బాల్ శిక్షణ శిబిరం



**నేటి సాక్షి, నారాయణపేట, జూన్ 6 :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి శెట్టి వెంకటేష్ గారి ఆదేశానుసారం మే 1 నుండి జూన్ 6 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర ధన్వాడ క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన నెట్ బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగిసినట్లు ఈ శిక్షణ శిబిరంలో బాల బాలికలు పాల్గొన్నారు కోచ్ డాక్టర్ రామ్మోహన్ గౌడ్ తెలిపారు.ఈ ముగింపు కార్యక్రమంలో పి ఈ టి రవికుమార్ టీచర్ వెంకటేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# భూభారతితో రైతులకు ఎంతో మేలు-మాజీ మంత్రి జీవన్రెడ్డి

- రైతులకు గైడ్గా వ్యవహరిస్తా
- కేంద్రం వరికి రూ.25వందలు మద్దతు అందించాలి



**నేటిసాక్షి, రాయికల్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వల్ల రైతులు ఆరిగోస పడ్డారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి ని తొలగించి భూ భారతిని తీసుకువచ్చిందని ఇక రైతులకు భూ భారతి ఎంతో మేలు చేస్తుందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్రెడ్డి తెలిపారు. శుక్రవారం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అభిప్రాయా లను సేకరించి భూసమస్యల శాశ్వత పరిష్కరానికి రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించిందన్నారు. గత ప్రభుత్వం 2017 డిసెంబరులో రెవెన్యూ అధికారుల ఇష్టానుసారంగా ధరణి పేరుతో భూ రికార్డులను ప్రక్షాళన చేసి రైతులను ఇబ్బందులు పెట్టి రెవెన్యూ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసారని ఆరోపించారు. నూతన భూ భారతి చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసారని రైతులు ఈ సదస్సులను ఉపయోగించుకొని సమస్యలను ఫిర్యాదు రూపంలో తీసుకొని పరిష్కార మార్గం చూపుతున్నట్లు తెలిపారు. రైతుల భూ సమస్యల ఫిర్యాదును తాహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్, రెవెన్యూ ట్రిబ్యునల్ ఇలా దశలవారీగా సమస్యలకు నూతన భూభారతి చట్టం పరిష్కార మార్గం చూపుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో రైతుల భూ సమస్యలకు తగు పరిష్కారం లభించకపోతే తాను గైడ్గా వ్యవహరించి రెవెన్యూ సమస్యలపై ప్రజలకు అండగా ఉండి న్యాయవాదిగా తాను న్యాయ సలహాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రెండు పర్యాయాలు అధికారం చేపట్టిన టిఆర్ఎస్ ప్రభుత్వం గడచిన 9 ఏళ్లలో రేషన్ కార్డులు ఇవ్వక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హతకు అనుగుణంగా రాజకీయాలకు అతీతంగా ఆర్భాటాలు లేకుండా రేషన్ కార్డు కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వరి రైతులకు అండగా ఉండి రూ. 2500 మద్దతు ధర అందించాలన్నారు. తెలంగాణలో ఈ దఫా 4.6లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ జరిగిందని గతంలో కంటే 1లక్ష మెట్రిక్ టన్నుల వరి ధాన్యం అదనంగా సేకరించామని తెలిపారు. ఆనంతరం రాయికల్ మండలం రామాజీపేట, భూపతిపూర్ గ్రామాల్లో జీవన్రెడ్డి పర్యటించారు. గంగమ్మ జాతరలో పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్,నాయకులు కొయ్యేడి మహిపాల్ రెడ్డి, మండ రమేష్, బాపురపు నర్సయ్య,, ఎద్దండి దివాకర్, ,షాకీర్,, పొన్నం శ్రీకాంత్, కొత్త పెల్లి గోపాల్,, రవీందర్,, జగదీష్,,బాపురపు రాజీవ్,, అశోక్,, రాజేష్,,సంతోష్,, నరసింహారెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

## ఎక్లాస్ పూర్ బడిబాట గ్రామసభలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



**నేటి సాక్షి :** పిల్లలకు నాణ్యమైన విద్య అందాలంటే బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాధికారి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

శుక్రవారం మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామంలో నిర్వహించిన బడిబాట గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన ఉందని, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని పిల్లలు అన్ని రంగాల్లో ముందు ఉండేలా ప్రోత్సాహం అందుతుందని, ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహకారం లభిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారు అన్నారు.సమాజంలోని ఒత్తిడిలను ఎదుర్కోవడానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సమర్థతను కలిగి ఉంటారని సమాజంలో అన్ని రంగాల్లో వారు రాణిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎక్లాస్ పూర్ గ్రామంలోని అన్ని పాఠశాలలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని మంచి ఉత్తీర్ణత శాతంతో ముందు ఉన్నాయని గ్రామస్తులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వారు పేర్కొన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్టా రవీంద్ర చారి మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి పై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోబడుతుందని వారి అభిరుచిలకు అనుగుణంగా ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, గుండా రాము, గ్రామ కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు శారద, కారోబార్ శ్రీనివాస్, ఆశా వర్కర్లు, మెడికల్ సిబ్బంది, అంగన్వాడి టీచర్, మహిళా సంఘాల బాధ్యులు, పాఠశాలల ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# నాణ్యత ప్రమాణాలు పక్కగా అమలు చేస్తున్నాం

- జిల్లా ఆసుపత్రి కిచెన్ రూమ్ తనిఖీ
- రోగులకు అందించే ఆహార పరిశీలన.
- సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు



**నేటి సాక్షి ప్రతినిధి వనపర్తి జిల్లా :** ఆసుపత్రిలో రోగులకు అందించే ఆహారా నాణ్యత విషయంలో డైట్ ప్రకారం పక్కాగా అమలు చేస్తున్నామని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు అన్నారు. శుక్రవారం జిల్లా జనరల్ ఆసుపత్రి మాతా శిశు సంరక్షణ కేంద్రాల్లోని వంట గదులను ఆర్ఎంఓ డాక్టర్ శివప్రసాద్ తో కలిసి తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, పంట గదిలోనే వండిన ఆహారాన్ని భోజనం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాదులోని ఎర్రగడ్డ ఆసుపత్రిలో ఫుడ్ పాయిజన్ జరిగిందని, దీంతో అన్ని ఆసుపత్రిలో కూడా అలాగే జరుగుతుందనుకోవడం సమంజసం కాదన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో గతం కంటే ఎంతో మెరుగైన ఫలితాలు సాధిస్తూ రోగులకు నాణ్యవంతమైన భోజనం అందిస్తున్నామని, మెనూ ప్రకారమే డైటీషియన్ ఆమోదంతో భోజనం అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతిరోజు వైద్యులు భోజనం చేసిన తర్వాతే రోగులకు వడ్డించడం జరుగుతుందని, వంటగదిలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేయడం, క్వాలిటీ రైస్ వాడటం, తాజా కూరగాయలనే వాడటం, ప్రతి రోగికి గుడ్డు, అరటిపండు అందించడం కూడా జరుగు తుందన్నారు. డయాబెటిక్ రోగులకు సైతం చపాతీలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎమ్మెల్యే మెగారెడ్డి నిత్యం ఆసుపత్రి పై పర్యవేక్షిస్తూనే ఉన్నారని, ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్త కథనాలు ప్రచారం చేయడం వల్ల సమాజానికి కూడా చేటు కలిగిస్తుందని అన్నారు...

# తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

## బి వెంకటేష్ గౌడ్.



**నేటి సాక్షి మిర్యాలగూడ రూరల్ జూన్ 6 :** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభుత్వం అందిస్తున్న అనేక సౌకర్యాలను ఉచితంగా పొంది తమ ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెనర్ పోలగాని వెంకటేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం రానిపాలెం గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసినటువంటి తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మంద రజిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో కాకునూరి విజయ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో చదివే రాయినిపాలెం విద్యార్థులకు సాయంత్రం పూట హోం వర్క్ లో సహాయపడుటకు ఒక వాలెంటర్ ను సొంత డబ్బుతో ఏర్పాటు చేస్తానని చెప్పారు. చిలకల సతీష్ మాట్లాడుతూ పాఠశాల లో ఫ్యాన్ ల మరమ్మతులకు 5000 రూపాయలు ఇస్తామన్నారు. కాకునూరి కృష్ణ గౌడ్ 50 ఇంచెస్ ఎల్ ఈ డి టీవీ ని పాఠశాల లో ఈ లెర్నింగ్ కొరకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు రంజిత్, బోడ వెంకన్న, గ్రామ కార్యదర్శి రమణ, అంగన్వాడి టీచర్ అరుణ, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# పేద విద్యార్థులకు బ్యాగ్స్ పెన్నులు బుక్స్ పంపిణీ

## యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు తాజ్ యూసుఫ్



**నేటి సాక్షి, నారాయణపేట, జూన్ 6 :** నారాయణపేట టౌన్ లో 23వ వార్డులో దాదాపు 50 మంది పేద విద్యార్థులకు సొంత ఖర్చులతో పాఠశాలలు ప్రారంభం అయ్యే సందర్భంగా పేద విద్యార్థులకు సొంత ఖర్చులతో బుక్ పెన్నులు కంపాక్స్ బాక్స్ బ్యాగులు లు పేద విద్యార్థులకు పంపిణీ చేశారు. భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా చదువుకోడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు కుటుంబాలకు అండగా నిలుస్తానని అలాంటి విద్యార్థులను ఎప్పుడూ ముందు ఉంటానని ఈ సందర్భంగా విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు అయితే 23 వార్డు లో సంప్రదించాలని యూసుఫ్ తాజ్ తల్లిదండ్రులు సంప్రదించాలని దిశా టీవీతో మాట్లాడుతూ తెలియజేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యూసుఫ్ తాజ్ భవిష్యత్తులో కూడా నిర్వహించాలని ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ నాయకులు సత్యనారాయణ యూసుఫ్ తాజ్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అవార్డు యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా రాజ్ ..కోటిల జన్మదిన వేడుకలు



**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ లింగేశ్వర నగర్ సర్పంచ్ ముసుకు కోటీశ్వరరావు, ఓటేరు సర్పంచ్ లక్ష్మి రాజా ల జన్మదిన వేడుకలు తిరుపతి రూరల్ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు ఇరువురికి తమ ఆశీస్సులు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు తెలిపిన వారిలో మండల పార్టీ అధ్యక్షుడు కొత్త పాటి మునీశ్వర రెడ్డి,ఎంపిపి మూలం చంద్రమోహన్ రెడ్డి,వైస్ ఎంపిపి విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్ లు చెరుకుల జనార్ధన్ యాదవ్, విడుదల రవికుమార్ రెడ్డి,చెంథిలి వెంకట రమణ, చిన్నీ యాదవ్, మన్నూరు శివకుమార్, మిట్టపల్లి ప్రసాద్ రెడ్డి, వెంకటరమణ, జానకి రామచంద్రయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లారపు శ్రీరాములు, మల్లె మొగ్గలు ఉమాపతి, సుధా యాదవ్, గురవారెడ్డి, హేమాద్రి లు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులకు భూమిపూజ



**నేటి సాక్షి, బెజ్జంకి:** పేదోడి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మానకొండూరు శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. వారి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీపూర్ గ్రామంలో హౌసింగ్ ఏఈ రవళి, పంచాయితీ కార్యదర్శి అనూష తో కలిసి కాంగ్రెస్ నాయకులు మార్కెట్ వైస్ చేర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు రెడ్డి రామకృష్ణారెడ్డి, చిలివేరు రాజిరెడ్డి, ముక్కిస శ్రీనివాస్ రెడ్డి, గంగాధర హరీష్ గార్లతో కలిసి ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారికి భూమి పూజ చేసి ముగ్గులు పోయడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు త్వరగా ఇల్లు పూర్తి చేసుకోవాలని వారి సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని అయన సూచించారు.

# ఫిట్నెస్ లేకుంటే కచ్చితంగా సీజ్ చేస్తాం

## ఇంచార్జి డిటిఓ శోభన్ వార్నింగ్



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** ఫిట్నెస్ లేని పాఠశాలల బస్సులపై కఠిన చర్యలు ఉంటాయని వరంగల్ ఇంచార్జ్ ఆర్టీవో శోభన్ బాబు అన్నారు. వరంగల్ జిల్లా రోడ్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రతి స్కూల్ మరియు కాలేజ్ బస్సులకు ఫిట్నెస్ కచ్చితంగా ఉండాలని జిల్లా వ్యాప్తంగా 350 బస్సులకు గాను 150 బస్సులకు మాత్రమే ఇప్పటి వరకు ఫిట్నెస్ పొందారని ఇంకా 200 బస్సుల యజమానులు బస్సులకు ఫిట్నెస్ తీసుకోలేదని, 15 సంవత్సరాల దాటిన బస్సులకు ఫిట్నెస్ ఇవ్వడం జరగదని, విద్యార్థులను తరలించే బస్సులకు ఇన్సూరెన్స్ ఫిట్నెస్ తో పాటు ఆర్టీవో నిబంధనలు పాటించాలని, బస్సు డ్రైవర్ కు కనీసం ఐదు సంవత్సరాల డ్రైవింగ్ అర్హత కలిగి ఉండాలని, ఎవరైతే నిబంధనలు ఉల్లంగిస్తారో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ ఆర్టీవో శోభన్ బాబు తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాలే వార్తలుగా..



# గ్రామ గ్రామాన కేంద్ర పథకాలు

## ప్రతి ఇంటి దాకా మోదీ సంకల్పం



**నేటి సాక్షి, బెజ్జంకి :** బెజ్జంకి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు ఆధ్వర్యంలో ప్రముఖ బీజేపీ నేతల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, అదేవిధంగా బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 5 వ తేదీ నుండి ఆగస్టు 15వ తేదీ వరకు నరేంద్రమోదీ 11 సంవత్సరల పాలన, అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ పతకాలు గ్రామస్థాయిలో ప్రజలకు తెలపాలని పార్టీ శ్రేణులకు తెలియజేశారు. ఆపరేషన్ సింధూర్ పై మండలంలోని గ్రామ గ్రామాన పార్టీ శ్రేణులకు ప్రజలకు వివరించాలని మండలం లోని బీజేపీ శ్రేణులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, మండల ఉపాధ్యక్షులు కొత్తపేట రామచంద్రం, గైని రాజు, మహిళా మోర్చా నాయకురాలు బండి పెల్లి సునీత గౌడ్, మండల నాయకులు దారం సత్తిరెడ్డి, బుర్ర క్రాంతికుమార్, కొర్వి అమర్, కదే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకిలో ఘనంగా బడిబాట కార్యక్రమం



**నేటి సాక్షి, బెజ్జంకి:** బెజ్జంకి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలురు, బాలికలు మరియు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బెజ్జంకి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ శ్రీరాములు మాట్లాడుతూ, బడిబాట కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైనది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు ఉచితం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, గుడ్లు, రాగిజావ, కంప్యూటర్ విద్య, లైబ్రరీ వంటి అనేక సదుపాయాలు ఉన్నాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతోంది. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటాం," అని తెలియజేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలలో బడి ఈడు పిల్లలందరినీ చేర్పించి, బడుగు%-%బలహీన వర్గాల పిల్లల విద్యకు బలమివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే. శ్రీరాములు , జెడ్ పి హెచ్ స్ బాలికల ప్రధానోపాధ్యాయులు రేవతి, ఎంపీపీ ఎస్ ప్రధానోపాధ్యాయులు వడ్లకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నారోజు శంకరాచారి, కె నాగయ్య, మంజుల, శ్రీవిద్య, శ్రీనివాసరావు, మాధవి లత,సరిత, ఎండి. రవూఫ్,బి. వేణు. అంగన్వాడీ టీచర్లు కనక లక్ష్మి,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా సాగిన శోభయాత్ర

## ఆనందంతో చిందేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 6 :** పేట జిల్లాలోనిమక్తల్ నియోజకవర్గం లో స్థానిక యాదవ్ నగర్ లో అతి పురాతనమైన శ్రీ శ్రీ శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునః నిర్మాణ , విగ్రహాల ప్రతిష్ట శోభాయాత్రలు పాల్గొన్న మొక్కలు నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ డాక్టర్ వాకిటి శ్రీహరి మరియు శ్రీమతి వాకిటి లలిత దంపతులు శ్రీశ్రీశ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం పునః నిర్మాణంలో భాగంగా గణపతి, గరుత్మంతుడు, శ్రీకృష్ణుల విగ్రహాల ప్రతిష్టాపన శోభాయాత్ర స్థానిక పడమటి ఆంజనేయ స్వామి నుండి స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ డాక్టర్ వాకిటి శ్రీహరి గారు ప్రారంభించారు మక్తల్ పురవీధుల ఆద్యంతం భక్తిశ్రద్ధలతో, భజనలతో, డబ్బు వాయిద్యాలతో ,చిన్నారుల నృత్యాలతో కన్నుల పండుగగా సాగింది.పండుగ వాతావరణాన్ని తలపించేలా సాగిన ఊరేగింపులో చిన్నారుల నృత్యాలకు ఎంతో ఆనందాన్ని వ్యక్తపరుస్తూ తాను కూడా తోటి భక్తులతో కలిసి చిందేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మక్తల్ పట్టణవాసులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ప్లాస్టిక్ తో పర్యావరణానికి ముప్పు



**నేటి సాక్షి, మెట్ పల్లి :** ప్లాస్టిక్ తో పర్యావరణానికి ముప్పు ఏర్పడి ప్రజా జీవితానికి తీవ్ర నష్టం కలుగుతుంది అని మున్సిపల్ కమిషనర్ మెహన్ అన్నారు. శుక్రవారం వంద ప్రణాళికలో భాగంగా కమిషనర్ పట్టణంలోని ఇరవై రెండవ వార్డులో తడి చెత్త పొడి చెత్త, హానికరమైన చెత్త, హెూమ్ కంపోస్టింగ్ మరియు నూట ఇరవై మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ వాడకం నిషేధం పై వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షకాలం దృష్ట్యా ముందస్తు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన చేయడం జరిగిందని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మీ ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి తడి చెత్తను ఆకుపచ్చ రంగు డబ్బాలో పొడి చెత్తను నీలిరంగు డబ్బాలో వేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వండి అని సూచించారు. తడి చెత్తను కంపోస్ట్ సెంటర్ కు తరలించి ఎరువుగా తయారు చేయటం జరుగుతుంది, పొడి చెత్తను డి.ఆర్. సి. సి సెంటర్ కు తరలిస్తామని అన్నారు. పట్టణ ప్రజలు తమ ఇంటి నుండి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి, హానికార చెత్తలుగా వేరు చేయుటకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్,ఎండి నిజాం, అశోక్, నరేష్ పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకోవడం సరి కాదు

## ఆపరేషన్ కగార్ శాంతి చర్చలు" పై జరుగు రౌండ్ టేబుల్ సమావేశాన్ని అడ్డుకోవడం సరి కాదు



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** కాకతీయ యూనివర్సిటీలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో "ఆపరేషన్ కగార్ - మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు"అనే అంశంపై జరుగు సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాల్గొనడం జరిగింది. ఈ సమావేశాన్ని పోలీసులు అడ్డుకోవడాన్ని పౌర హక్కుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఖండించింది. వివిధ ప్రజా సంఘాలు మరియు విద్యార్థి సంఘాల సమన్వయంతో "ఆపరేషన్ కగార్ శాంతి చర్చలు" పై జరుగు రౌండ్ టేబుల్ సమావేశాన్ని హనుమకొండ ఏసీపీ ఆధ్వర్యంలో అడ్డుకోవడం సమావేశం హాలుకు తాళం వేయడాన్ని పౌర హక్కుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఖండిస్తుంది. ఇది భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 19 కి వ్యతిరేకం ప్రతి వ్యక్తికి, సంఘానికి భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగారు పేరుతో 1-1- 2023 నుండి నేటి వరకు దాదాపుగా 580 మంది ఆదివాసీలను మరియు మావోయిస్టులను హత్య చేయడం వాటిని ఎన్కౌంటర్లుగా చిత్రీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వెంటనే ఆపరేషన్ కగార్ ఆపి వేయాలని శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బోళ్ల జయంత్, బి.ఎస్.పాణి అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి ఉమ్మడి వరంగల్ జిల్లా మరియు రాష్ట్ర కమిటీ సీనియర్ నాయకులు పి. రమేష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

## జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్

**నేటి సాక్షి నారాయణపేట, జూన్ 6 :** బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు. ఎస్పీ బక్రీద్ పండుగను జిల్లా ప్రజలు మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా లిఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపి, ఎస్పీ గారు మాట్లాడుతూ... త్యాగానికి ప్రతికగా ముస్లిం సోదరులు జరుపుకునే బక్రీద్ పర్వదినం కోసం పోలీస్ అధికారులు అన్ని భద్రత ఏర్పాట్లు చేశామని, బక్రీద్ పండుగ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని అందుకు పోలీసు అధికారులకు భద్రతాపరమైన సూచనలు ఇవ్వడం జరిగింది అని ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ తెలిపారు. నారాయణపేట జిల్లా పరిధి లో ఉన్న ఈద్గాల దగ్గర ప్రార్థన మందిరాల వద్ద ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పండగ రోజు ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు తావు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజలకు ఏలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్ ఏర్పాటు చేసి, అవసరం ఉన్న చోట పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలంతా మతసామరస్యాన్ని కాపాడుకుంటూ సామరస్యంగా, శాంతియుతంగా పరస్పరం ఇతర మతాలను గౌరవించుకుంటూ తమ పండగలను సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ కోరారు. ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకూడదని తెలియజేశారు. సోషల్ మీడియాలో పూర్తిస్థాయి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైనా వివాదాస్పదంగా పోస్టులు చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.



జిల్లా ప్రజలు అత్యవసర సమయంలో 24/7 పోలీస్ కంట్రోల్ రూమ్. 8712670399 కి, డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లకు సంప్రదించాలని ఎస్పీ కోరారు.

# సాగునీటిని విడుదల చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**నేటి సాక్షి,నారాయణపేట, జూన్ 6 :** నారాయణపేట జిల్లాలోని మక్తల్ నియోజకవర్గం చిన్నగోపులాపూర్ స్టేజ్-1 నుండి నేడు ఓపెన్ కెనాల్ ద్వారా భూత్పూర్ రిజర్వాయర్, సంగంబండ ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసిన మక్తల్ నియోజకవర్గ శాసన సభ్యులు గౌరవ శ్రీ డా,, వాకిటి శ్రీహరి ఆధ్వరంలో విడుదల చేశారు. అనంతరం గౌరవ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాలకు గాను భీమా నది ఎక్కువగా మారడంతో జూరాల ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పెరగడంతో మన మక్తల్ నియోజకవర్గం లోని రాజీవ్ ఎత్తిపోతల పథకం స్టేజి-1 నుండి నేడు నీటిని విడుదల చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటివరకు స్టేజ్ -1 మూడు పంపులు ఉండగా ఇప్పటివరకు కేవలం రెండు పంపులు మాత్రమే ఉపయోగంలో ఉండగా మూడవ పంపు 2018 ఉంది నిరూప యోగంగా ఉండగా అందుకుగాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మూడవ పంపు





గాను గత సంవత్సరం డిసెంబర్లో ఒక కోటి నాలుగు లక్షల రూపాయల నిధులను మూడో పంపు మరమ్మత్తుల నిమిత్తం నిధులను విడుదల చేయడం జరిగిందని అన్నారు. గత సంవత్సరం జూన్ 13న నీటిని విడుదల చేయగా ఈ సంవత్సరం ఒక వారానికి ముందే నీటిని విడుదల చేయడం జరిగిందని అందుకు స్టేజ్ వన్ లోని సాంకేతికపరమైన యంత్రాలను పూర్తిస్థాయిలో ఆధునీకరణ చేసే అన్ని యంత్రాలను పనిచేసే విధంగా ఏర్పాటు చేయడానికి నిధులు సమకూర్చినటువంటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి గౌరవనీయులు పెద్దలు శ్రీ ఉత్తంకుమార్ రెడ్డి గారికి మరియు రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు పెద్దలు యనుమల్ల రేవంత్ రెడ్డి గారికి మక్తల్ నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు మరియు చుట్టుపక్కల గ్రామాల రైతులు సంబంధిత ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలి

## బడిబాట కార్యక్రమం -గ్రామసభ



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం, పాఠశాల విద్యాశాఖ మార్గ దర్శకాలకు అనుగుణంగా శుక్రవారం బడిబాట కార్యక్రమం అధికారికంగా జిల్లాలోని పాఠశాలలు ఉన్న అన్ని గ్రామాలలో గ్రామసభతో ప్రారంభం చేయడం జరిగింది. ఖాజీపేట మండలం మడికొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన గ్రామసభ కు ముఖ్య అతిధిగా పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్య నారాయణ రెడ్డి హజరు కావడం జరిగింది. ఉపాధ్యాయులు తల్లి దండ్రులు, గ్రామ పెద్దలు, అంగన్వాడి టీచర్స్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, మహిళా సంఘ సభ్యులు మరియూ యువకులు హజరు అయి ఈ సమావేశం లో ఆర్ జె డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ " బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే ప్రభుత్వ బడులలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు తమ పరిధిలో గల ఆవాస ప్రాంతం లో ప్రతీ ఇంటికి తిరిగి ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతలను వివరించి, ప్రభుత్వ బడి పట్ల తల్లి తండ్రులకు విశ్వాసం కల్పించాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు కృత్రిమ మేధ (అర్టిఫిషల్ ఇంటెలేజెన్సీ) విధానంలో తరగతి బోధన ఉంటుందని దానికి అనుగుణంగా పాఠాలా రూప కల్పన జరిగిందని వివరించారు. లక్షల రూపాయల వ్యయంతో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేయటం జరిగిందని చెప్పారు. ఆంగ్ల భాష నైపుణ్యం పెంచడానికి, ఎన్ ఎం ఎం ఎస్, గురుకుల, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి పోటీ పరీక్షల తయారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, కృత్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, రెండు జతల ఏకరూప దుస్తులు ఇవ్వడం గ్రంధాలయం, ప్రయోగశాల ఏర్పాటు చేయడం జరుగుతుంది అని చెప్పారు. నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మొబిలైజింగ్ అధికారి బద్దం సుదర్శన్ రెడ్డి, మండల విద్యాధికారి మనోజ్ కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి ప్రాధమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, మాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్. సమస్యలు వెంటనే పరిష్కరించండి

## ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య

**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం తుడా టవర్స్ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన వినతుల పరిష్కారం, తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తున్నారని, వెంటనే పరిష్కరించాలని అన్నారు. ముఖ్యంగా ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల్లో ఎక్కువ పెండింగ్ ఉంటున్నాయని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులు, సిబ్బంది పై చర్యలు తప్పవని హెచ్చరించారు. తుడా టవర్స్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతతో పనులు చేయాలని అన్నారు. అధికారులు అందరూ సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలని అన్నారు.



ఈ కార్యక్రమాల్లో తుడా సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, తదితరులు ఉన్నారు.

# ఎవ్వరి కళ్లలో ఆనందం చూడటానికి ఇదంతా చేస్తున్నారు

- నా కుటుంబంలో లిక్కర్ వల్ల ఇద్దరిని కోల్పోయా
- ఆ బాధ నాకు తెలుసు..!
- అందుకే లిక్కర్ అన్నా.. ఆ వ్యాపారమన్నా.. నాకు అసహ్యం..
- అలాంటిది నన్ను లిక్కర్ స్కాంలో ఇరికించాలని చూడటం అనైతికం
- నాతో సన్నిహితంగా వుండే వెంకటేష్ కుటుంబాన్ని తీసుకు వెళ్లారు
- రెండు రోజులుగా ఆ కుటుంబాన్ని హింసించడం అన్యాయం
- ఏఎస్పీ కొల్లు శ్రీనివాస్ తీరు 'సిట్' సిబ్బందికే నచ్చడం లేదు
- చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**నేటి సాక్షి తిరుపతి జిల్లా (బాదూరు బాల) :** 'నా కుటుంబంలో లిక్కర్ వల్ల ఇద్దరిని కోల్పోయాను.. ఆ బాధ నాకు తెలుసు.. అందుకే లిక్కర్ అన్నా.. లిక్కర్ బిజినెస్ అన్నా నాకు నచ్చదు.. లిక్కర్ వ్యాపారంలో కోట్లు సంపాదన చేయవచ్చునని చెప్పినా నాకు అవసరం లేదని చెబుతా.. అలాంటిది నన్ను లిక్కర్ స్కాంలో ఇరికించాలని కుట్రలు చేస్తున్నారు.. ఇది దుర్మార్గం. నా చిన్నప్పటి నుంచి సన్నిహితంగా వుండే హైదరాబాద్‌లో కాపురం వున్న వెంకటేష్ కుటుంబాన్ని రెండు రోజులుగా సిట్ అధికారులు తీసుకువెళ్లి హింసించడం అన్యాయం, నాపై తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వాలని ఒత్తిడి తేవడం అనైతికం.. నాకే లిక్కర్‌తో సంబంధం లేనపుడు నాతో తిరిగే వాళ్లను ఎందుకు హింస అంతలా పెడుతున్నారో అర్థం కావడం లేదు.. మీ టార్గెట్ నేనే అయితే వచ్చి అరెస్టు చేసుకోండి.. అంతేగానీ దయచేసి నాతో పాటు వున్న వాళ్లను ఇబ్బంది పెట్టకండి' అంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాదులో నివాసముంటున్న తన ఆత్మీయుడు వెంకటేష్, అతని భార్య, ఏడాది వయస్సు వున్న కుమారుడుని సిట్ అధికారులు తమ కార్యాలయంలో బంధించి భయపెడుతున్నారు. నైతిక విలువలున్న ఆ వ్యక్తి పట్ల ఏఎస్పీ శ్రీనివాస్ విచక్షణ కోల్పోయి అనరాని మాటలతో మానసికంగా బాధపెట్టడం, తప్పుడు స్టేట్ మెంట్‌లో సంతకం పెట్టకుంటే ఈ కేసులో కాకున్నా, తన వద్ద ఇన్వెస్టిగేషన్ జరుగుతున్న కేసులు చాలానే వున్నాయని, అందులో నిన్ను ఇరికించి శాశ్వతంగా జైలు జీవతం గడిపేలా చేస్తానని బెదిరించడం వంటి పనులు చేస్తున్నారని ఆరోపించారు. అప్పటికీ అతను అంగీకరించక పోవడంతో ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నీకు ఎంత డబ్బులు కావాలన్నా తీసిస్తా, వర్కులు ఇప్పిస్తా, మంచి సంబంధాలు ఏర్పాటు చేయిస్తా ఒక్క సంతకం పెడితే చాలు అని ప్రలోభాలు కూడా పెడుతున్నట్టుగా తనకు తెలిసిందని వివరించారు. అయినా సరే చెవిరెడ్డికి ఏ సంబంధం లేని దాంట్లో సంతకం పెట్టి సంబంధం వున్నట్టు చెబితే అంతకన్నా పాపం మరొకటి వుండదని, ఆ పాపాలు నాకు వద్దు ఈ తప్పుడు పత్రాలపై సంతకం పెట్టను అని వెంకటేష్ అన్న మాటకు ఏఎస్పీ శ్రీనివాస్ సిట్ కార్యాలయంలోని బల్లలను గుద్దుతూ ఆ రూము అంతా ప్రతిధ్వనించేలా అరుస్తూ ఒక భయానక వాతావరణం సృష్టించినట్టు ఆ కార్యాలయ సిబ్బందే చెబుతున్నారని చెవిరెడ్డి స్పష్టం చేశారు. ఇలా అమాయకులను వేధిస్తూ ఎవ్వరి కళ్లలో ఆనందం చూడటానికి కొల్లు శ్రీనివాస్ ఇదంతా చేస్తున్నారో తెలియడం లేదన్నారు. చెవిరెడ్డిని అరెస్టు చేయాలన్న తపన, తాపత్రయం, చేస్తున్న అరాచకం చూసిన సిట్ కార్యాలయ సిబ్బంది అసహ్యించుకుంటు వున్నారన్న విషయం ఆయన గమనించాలన్నారు. కొల్లు శ్రీనివాస్



తప్పుడు పత్రాలపై సంతకం పెట్టించుకునేందుకు అమాయకులను పెడుతున్న టార్చర్ బాధితులకు కష్టమనిపించినా ప్రకృతి వారిని విడిచిపెట్టదన్న విషయం ఆయన గుర్తుంచుకోవాలన్నారు. వెంకటేష్ కుటుంబ సభ్యులనే కాదు ఆయన వద్ద పనిచేసే చిన్న, చిన్న ఉద్యోగులను కూడా తీసుకువెళ్లి ఇబ్బంది పెట్టడం, ఆ కుటుంబానికి నరకం చూపించడాన్ని సమాజం అంగీకరించదన్నారు. ఎంత మంది అమాయకులను బెదిరించి, కొట్టి సంతకాలు తీసుకున్నా, వీడియోలు రికార్డింగ్ చేయించినా వారు అక్కడ నుంచి బయటకు వచ్చాక నేరుగా న్యాయస్థానంలో జడ్జిగారికి వివరిస్తారన్న విషయం సిట్ అధికారులు గమనించాలన్నారు. చివరగా ఒక్కమాట చెబుతున్నా.. లిక్కర్ స్కాంలో నాకే సంబంధం లేనపుడు నాతోపాటు తిరిగే ఏ ఒక్కరికైనా ఎలా సంబంధం ఉంటుందో ఆలోచించాలన్నారు. అయినా సరే చెవిరెడ్డిని ఈ స్కాంలో ఇరికించాలని, ఎవ్వరినో మెప్పించడానికి అలా చేస్తుంటే మీరు కొట్టాలన్నా, ఇబ్బంది పెట్టాలన్నా, తిట్టాలన్నా కేసులు పెట్టి జైలుపాలు చేయాలన్నా తాను సిద్ధంగానే వున్నానన్నారు. అంతేగానీ చిన్నచిన్న ఉద్యోగుల జీవితాలను నాశనం చేయవద్దని మానసికంగా, శారీరకంగా చంపేయకండని చెవిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

# బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కడియం కావ్య

- త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ
- అల్లా దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముస్లిం సోదర, సోదరీమణులకు ఈద్ ఉల్ అధా (బక్రీద్ )పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలన్నారు. "దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ.. ఈ పండుగ జరుపుకొంటారన్నారు. భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుంది" అని అన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు. అల్లా దయతో ప్రజలు సుబిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నారు.



# 'ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించండి'



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు మార్గదర్శకంగా నిలవాలని ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్స్, మరియు టీచర్స్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొత్తలపాలెం మోడల్ పాఠశాల మరియు కళాశాల, చెన్నైపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కల్లెపల్లి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్స్ మరియు గ్రామస్తుల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించడంతో వారి ఉజ్వల భవిష్యత్తుకు, తల్లిదండ్రులు మార్గం చూపిన వారు అవుతారని, ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌళిక సదుపాయాలతో పాటు, అనుభవజ్ఞులైన టీచర్స్ ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, టీచర్స్, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సౌదీలో మానాల సంఘం నూతన కార్యవర్గం

## నూతన అధ్యక్షులుగా అల్లూరి శివకుమార్



**నేటి సాక్షి, దుబాయ్ గల్ఫ్ ప్రతినిధి: ( కోక్కుల వంశీ ) :** రాజన్న సిరిసిల్ల జిల్లా, రుద్రంగి మండలం మానాల సౌదీ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సౌదీ లో సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పాటు మాజీ అధ్యక్షుడు అల్లూరి సంతోష్, మాజీ ఉప అధ్యక్షుడు బెల్లాల తిరుపతి, సంఘ సభ్యుల సమక్షంలో నూతన అద్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అల్లూరి శివకుమార్, ఉపా అధ్యక్షులు గా యాసోజీ శేఖర్ లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అల్లూరి శివకుమార్, ఉపా అధ్యక్షులు యాసోజీ శేఖర్ మాట్లాడుతూ.. మానాల సౌదీ సంఘ అభివృద్ధికి, మరియు గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని, అందరూ సహకరించాలని కోరారు. తమను అధ్యక్షులు, ఉపా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం అందరూ కలిసి సామూహిక భోజనం చేసి ఒకరినొకరు మంచి చెడులు తెలుసుకొని, ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మానాల సౌదీ సంఘం సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## రుద్రంగి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన మోతిరామ్




**నేటిసాక్షి ప్రతినిధి, రుద్రంగి : ( కోక్కుల వంశీ ) :** శాంతి భద్రతలో పరిరక్షణలో మండలం లోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రుద్రంగి ఎస్సైగా నూతన బాధ్యతలు చేపట్టిన మోతిరామ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఆదేశానుసారం రుద్రంగి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో ఎస్సైగా బాధ్యతలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. మోతీరామ్ గతంలో వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లో పనిచేశారు. ఇక్కడ విధులు నిర్వహించిన సిరిసిల్ల అశోక్ ఇల్లంతకుంట ఎస్సై గా బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మోతిరామ్ మాట్లాడుతూ... రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండల ప్రజలు సహకరించాలని ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరుసహకరించాలని తెలిపారు.

నేటి సాక్షి
తెలుగు దిన పత్రిక | NETI SAKSHI TELUGU DAILY | వాస్తవాల వార్తలుగా..
15
శనివారం
7 జూన్ 2025

# సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని వంగపహాడ్ గ్రామం నందు ఎఫ్ ఎమ్ ఎమ్ సాంఘిక సేవ సమితి మండల కో..ఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్ ఆధ్వర్యంలో వంగపహాడ్ హెల్త్ అసిస్టెంట్ సంపూర్ణ అధ్యక్షతన ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు మరియు మానవ, బాల అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి వంగపహాడ్ హెల్త్ సబ్ సెంటర్ ఎం పి హెచ్ ఎ సంపూర్ణ మాట్లాడుతూ వంగపహాడ్ గ్రామంలో పరిశుభ్రతతో పాటుగా పర్యవరణాన్ని శుభ్రంగా ఉంచుకొని దోమలు చేరకుండా నీళ్ల మీద ఇంటి లోపల ఉన్న కూలర్లు, ఫ్రిజ్ లో డ్రమ్ముల మీద నీళ్లు ఉన్న ప్రదేశాన్ని నీట్ గా ఉంచుకోవాలని చేతులను ఎప్పటికీ శుభ్రం చేసుకోవాలని ప్రస్తుత కాలంలో కోవిడ్- 19 కరోనా వైరస్ మళ్ళీ వ్యాప్తి చెందుతుందని దేశవ్యాప్తంగా వార్తాపత్రికల ద్వారా తెలుసుకుంటున్నాం. కాబట్టి ఇంటి నుంచి బయటకు వెళ్లి వచ్చినప్పుడు చేతులను కాళ్ళను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. ఈసంపల్లి సుదర్శన్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వివిధ రూపాలలో వివిధ మార్గాలలో జరుగుతున్నందున ప్రతి విషయంలో తగు జాగ్రతలు పిల్లలకు నేర్పించడం కాకుండా సమాజాన్ని మేల్కొల్పి అక్రమ వలస దారుల వలలో చిక్కుకోకుండా చూసుకోవాలని ఎప్పటికప్పుడు పిల్లల ప్రవర్తన మీద తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంటుందని తెలియజేశారు. మానవక్రమ రవాణా ఎక్కువగా జరుగుతుందని దీని రూపుమాపి బాల్య వివాహాలు, బ్రూన హత్యలు జరగకుండా ఇతరులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎం ఎం కో..ఆర్డినేటర్ సుదర్శన్, వంగపహాడ్ హెల్త్ అసిస్టెంట్ సంపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ కోమల, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్ జ్యోతి, తదితరులు, మహిళలు, పాల్గొన్నారు.

## ముత్తన్నపేటలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్టాపన



**నేటి సాక్షి, బెజ్జంకి:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన సందర్భంగా శుక్రవారం రోజున బోనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. విగ్రహాలకు జలాధివాసం,జరిపారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కులాల ప్రజలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తూ,ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తి, గ్రామ వీధుల్లో ఊరేగింపు జరిపారు. శనివారం రోజున కుంకుమ పూజ,నవగ్రహ పూజ,యజ్ఞం,పంచమృతాలతో పూజ చేయడం జరుగుతుంది. ఆదివారం రోజున 7-00 గంటలకు యజ్ఞం, ఉదయం 11-00 గంటలకు విగ్రహ ప్రతిష్టాపన మరియు బొడ్రాయికి బోనం, ఓడిబియ్యం, సాయంత్రం 4-00 గంటల నుంచి సోమవారం ఉదయం 8-00 గంటల వరకు గ్రామభలి చేయడం, సోమవారం రోజున ఉదయం 8-00 గంటల వరకు ఆడపడుచులకు, ఇంటి యాజమానులకు ఓడిబియ్యం పోసుకోవడంతో కార్యక్రమం ముగిస్తుందని గ్రామస్తులు తెలిపారు.

## ఆత్మీయులకు, హృదయపూర్వక కృతజ్ఞతలు




**నేటి సాక్షి, నారాయణపేట, జూన్ 6:** జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఆత్మీయులకూ నా హృదయపూర్వక కృతజ్ఞతలను సూర్యచంద్ర ఫౌండేషన్ చైర్మన్, నారాయణపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎస్ సూర్య మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నా జన్మదినాన్ని ప్రత్యేకంగా ప్రతి ఒక్కరికిప్రత్యక్షంగా కలుసుకుని, కాల్ ద్వారా, వాట్సాప్‌లో, సోషల్ మీడియాలో ఓ సందేశం రూపంలోకి ఈవెన్ ఒక్క మాటలో అయినా శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి శ్రేయోభిలాషికి, స్నేహితుడికి, అన్నలకు, తమ్ముళ్లకు, గౌరవనీయ పెద్దలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.మీ ప్రేమ, మద్దతు, ఆశీర్వాదాలు నా ప్రయాణానికి మార్గదర్శకం. ఇలాంటి ఆదరణ అందుకోవడం నిజంగా ఒక వరం అన్నారు.

## కిడ్నాప్ కేసును 24 గంటల్లో ఛేదించిన హన్మకొండ పోలీసులు




**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** హన్మకొండలో కిడ్నాప్ అయిన 3 సంవత్సరాల బాలుడిని తల్లి దండ్రులకు అప్పగించిన హన్మకొండ పోలీసులు. హనుమకొండ యాదవ నగర్ కు చెందిన దంపతులు రుద్రవేణి నరేష్ జ్యోతి యాదవ నగర్ లో నివాసం ఉంటున్నారు. వారి బాబు ఇంటి వద్ద ఆడుకుంటుండగా అబ్బా యి మేనమామ అయిన తాండ్ర ప్రశాంత్ అను వ్యక్తి మంథని ముత్తారంకు చెందిన వ్యక్తి బాబుని కిడ్నాప్ చేశాడు. ఇట్టి విషయంలో హనుమకొండ హెచ్ ఓ కేసు నమోదు చేసి బాలుని ఆచూకీ తెలుసుకొని వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది.

# మెగా ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

### కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే కలసి ప్రారంభించిన మేయర్ గుండు సుధారాణి



**నేటి సాక్షి ఉమ్మడి వరంగల్ (సందెల రాజు) :** మెగా ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. శుక్రవారం బల్దియాలోని ఇండోర్ స్టేడియంలో 100 రోజుల కార్యక్రమాల్లో భాగంగా జిడబ్ల్యుఎంసి, మెడి కవర్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో పారిశుద్ధ్య, మెప్మా సిబ్బందికి ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాఖేడే తో కలసి మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు కార్యక్రమాల అమలు చేయాలని ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో పట్టణ స్థానిక సంస్థల్లో జూన్ 2వ తేదీ నుండి సెప్టెంబర్ 10వ తేదీ వరకు 100 రోజుల ప్రణాళిక అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పరిశుభ్రమైన, ఆరోగ్య వంతమైన ఎలాంటి విపత్తులను ఎదుర్కొనే విధంగా వరంగల్ మహా నగర పాలక సంస్థను నిర్మించే దిశగా చేస్తున్న కృషి లో ప్రతిరోజు 'ఒక చర్య ఒక మార్పు' అనే నినాదంతో ముందుకెళుతున్నామన్నారు. బల్దియాలో మౌలిక సదుపాయాలు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచి ప్రజలే ముందు అనే నినాదంతో స్థిరమైన పట్టణాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు మేయర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం తద్వారా సమాజం ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ వంద రోజుల కార్యక్రమాల భాగంగా శుక్రవారం పారిశుద్ధ్య, మెప్మా సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా మెడికవర్ ఆసుపత్రి సహకారంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా హెల్త్ క్యాంప్ లో డయాబెటిక్ ఆర్తో కార్డియో జనరల్ ఆరోగ్య చెకప్ లతో పాటు దానికి సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా స్వయంగా డాక్టర్ ఆయిన కమిషనర్ మేయర్ కు ఆరోగ్య పరీక్షలు చేశారు. కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని పారిశుద్ధ్య కార్మికులు మెప్మా సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రేటర్ వరంగల్ నగరాభివృద్ధిలో నగర ప్రజలు భాగస్వాములై తమ వంతు సహకారం అందించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ డైరెక్టర్ వినోద్, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, కమిషనర్ అదనపు కమిషనర్ జోన, డాక్టర్ రాజిరెడ్డి, ఎం హెచ్ ఓ రాజేష్, ఇంచార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఆర్టికల్చర్ ఆఫీసర్లు రమేష్, లక్ష్మారెడ్డి,బిడాక్టర్లు సూపర్వైజర్లు, బల్దియా సిబ్బంది, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# 60 ఏళ్లలో చేయని అభివృద్ధి 11ఏళ్లలో చేసిన ప్రధాన మంత్రి

### 11వ స్థానం లో దేశాన్ని 4వ స్థానం లో నిలబెట్టిన ఘనత నరేంద్రమోదీగారిదే- బిజెపి మండల అ్యక్షుడు జి శ్రీపాద రెడ్డి



**నేటి సాక్షి ప్రతినిధి గద్వాల్ : ( రమేష్ ) :** శుక్రవారం భారతీ-య జనతా పార్టీ రాష్ట్ర ఆదేశానుసారం పాలమూరు ఎంపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణమ్మ డీకే అరుణమ్మ పిలుపు మేరకు జోగులాంబ గద్వాల జిల్లా కేటి దొడ్డి మండల కేంద్రంలో 11 సంవత్సరాల నరేంద్ర మోడీ పూర్తి సందర్భంగా వికసిత్ భారత్ సంకల్పం లో బాగంగా బిజెపి మండల అ్యక్షుడు జి శ్రీపాద రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కేటి దొడ్డి మండల బిజెపి అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాల లో తీసుకొచ్చినటువంటి ఆవిష్కరణలు గానీ చట్టాలకు గానీ వాటిపైన సుదీర్ఘంగా వివరించడం జరిగింది. అలాగే నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాల గురించి దానిలో భాగంగా ఆయుష్మాన్ భారత్ పథకం సుకన్య సమృద్ధి యోజన త్రిపుల్ తలాక్ వంటి 30 ఏళ్లలో సహకారం కానటువంటి ఎస్సీ వర్గీకరణ ఈరోజు నరేంద్ర మోడీ చేసి చూపెట్టడం జరిగింది.11 సంవత్సరాల లో రైల్వేల యొక్క అభివృద్ధి టెక్నాలజీ అభివృద్ధి ప్రపంచ దేశాలతో అతిపెద్ద నాలుగు ఆర్థిక వ్యవస్థగా అవతరించినటువంటి భారతదేశం ఇది పూర్తిగా నరేంద్ర మోడీ యొక్క పాలనదక్షితకు నిదర్శనమని అలాగే మొన్న జరిగినటువంటి ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్ కు గట్టి సమాధానం చెప్పినటువంటి ప్రభుత్వం నరేంద్ర మోడీ ప్రభుత్వం అని భవిష్యత్తులో ఉగ్రవాద దాడులు గనక జరిగితే ఇలాంటి పరిస్థితులు ఆపరేషన్ సింధూరం ద్వారా ఉగ్రవాదులను పాకిస్తాన్లో మట్టి పెట్టేటువంటి శక్తి ఈరోజు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి భారతదేశానికి ఉ ందనేటువంటి అంశాన్ని పూర్తిగా వివరించడం జరిగింది. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాములు మండల యూత్ నాయకుడు, కృష్ణ కాంత్, వాచ్ నాయక్, మాజీ ఎం పి టి సి రంగప్ప రంగాపురం కృష్ణ వీరన్న తదితరులు పాల్గొనడం జరిగినది

# బందీలుగా ఉన్న ఆ ఎనిమిది మందిని కూడా చంపేస్తారా.?

### తెలంగాణ పౌర హక్కుల సంఘం నేతల ఆందోళన

**నేటి సాక్షి - తెలంగాణ బ్యూరో :** ఛత్తీస్గఢ్ పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్ట్ నాయకులు బండి ప్రకాష్,ఎస్జడ్సీ నాయకుడు పాపారావు, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్ ,మద్దెడు ఏరియా కార్యదర్శి సీతు, రామన్న డిసి మెంబర్, మున్నా, సునీత, మహేష్ లతో పాటు పది మంది మావోయిస్ట్ నాయకుల కు పోలీసులు ప్రాణ హాని తలపెట్టకుండా వెంటనే కోర్ట్ లో హాజరు పరచాలని.. తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావులు డిమాండ్ చేశారు. ఛత్తీస్గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవి ప్రాంతంలోని ఒక గ్రామంలో నిన్న మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ మెంబర్ సుధాకర్,తెలంగాణ రాష్ట్ర కమిటీ మెంబెర్ మైలారపు ఆడేళ్ళు అలియాస్ భాస్కర్, బండి ప్రకాష్, ఎస్జడ్సీ నాయకుడు పాపారావు, నేషనల్ పార్క్ కార్యదర్శి దిలీప్ ,మద్దెడు ఏరియా కార్యదర్శి సీతు, రామన్న డిసి మెంబర్, మున్నా, సునీత, మహేష్ లతో పాటు పది మంది మావోయిస్ట్ నాయకుల ను పోలీసులు ప్రాణాలతో పట్టుకొన్నారన్నారు. 5.న సుధాకర్ ను ఎన్కౌంటర్ పేరున హత్య చేయగా.. అలాగే 6.న సాయంత్రం భాస్కర్ ను కూడా ఎన్కౌంటర్ పేర్న హత్య చేశారని ఆరోపించారు. ఇంకా వారి అదుపులోని బండి ప్రకాష్, మిగతా మావోయిస్టు నాయకులను ఎన్కౌంటర్ పేరున హత్య చేసే ప్రమాదముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.వారికి ఎలాంటి హాని తల పెట్టకుండా వెంటనే కోర్టులో హాజరు పరచాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ డిమాండ్ చేస్తున్నదన్నారు ప్రాణాలతో దొరికిన దొరికిన మావోయిస్టు నాయకుల ను ఎన్కౌంటర్ పేరా హత మార్చడం రాజ్యాంగ విరుద్ధం చట్ట వ్యతిరేకమన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు, ,ప్రతిపక్ష పార్టీలు దీన్ని ముక్త కంఠం తో ఖండించాలని కోరుతున్నామని పిలుపునిచ్చారు. మావోయిస్ట్ పార్టీ ప్రకటించినట్లు గా కేంద్ర ప్రభుత్వం కూడా కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్ట్ పార్టీ తో శాంతి చర్చలు జరపాలని పౌర హక్కుల సంఘం తెలంగాణ డిమాండ్ చేసింది.